పెళ్లంటే..!



ఆకాశం దిగివచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి.. ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్లంటే మరి.. ప్రస్తుతం అందరూ ఇదే ట్రెండ్ అనుసరిస్తున్నారు.. పెళ్లంటే బడ్జెట్ గురించి ఆలోచనే లేదు..జీవితంలో ఒక్కసారే చేసుకునే వేడుక అంటూ లక్షణంగా లక్షలు ఖర్చు పెడుతున్నారు.. ఊరంతా చెప్పుకునేలా అంగరంగ వైభవంగా చేసుకుంటున్నారు.. పూర్వం పెద్దలు చెప్పినట్టు భూదేవి అంత పీట వేసి.. ఆకాశమంత పందిరి వేస్తున్నారు.. ఒక్కో పెళ్లి చూస్తుంటే చిన్న సినిమాతో పోటీ పడుతుందంటే అతిశయోక్తి కాదేమో.. పెళ్లి మండపం నుంచి పసందైన విందు.. వీడియో షూటింగ్ వరకూ అంతా ప్రత్యేకమే.. పెళ్లి కుమారుడి.. పెళ్లి కుమార్తె ఊరేగింపునకే లక్షలు ఖర్చు పెడుతున్నారు.. పెళ్లి మండపమే రూ.12 లక్షలట.. ఖర్చు ఎంతయినా పరవాలేదు.. ఎక్కడా లోటు రాకూడదనేది పెళ్లి పెద్ద మాట..ఈ మూడు నెలలూ వివాహ ముహూర్తాలు ఉండడంతో అప్పుడే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి వచ్చేసింది.. - వివరాలు 6వ పేజీలో

ఫస్టియర్ మెడికోలకు హాస్టల్ సౌకర్యం

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రవేశాలు పొందిన ఫస్టియర్ విద్యార్థులకు మెడికల్ కాలేజీ అధికారులు హాస్టల్ సౌకర్యం వసతి కల్పించారు. మెడికోలకు వసతెలా అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గతేడాది ఫస్టియర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన నాలుగు తాత్కాలిక హాస్టళ్లను కొత్తగా చేరిన వారికి కేటాయించారు. దీంతో ఫస్టియర్‌లో చేరిన మెడికోలు కేటాయించిన హాస్టళ్లలోకి చేరుకున్నారు. ఈ ఏడాది ఫస్టియర్‌లో 140 మంది వరకూ ప్రవేశాలు పొందగా సోమవారం సుమారు 50 మంది వరకూ హాస్టల్స్‌లో వసతి తీసుకున్నారు. మిగిలిన వాళ్లు ఒకట్రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ తాత్కాలిక హాస్టళ్లలో ఉంటూ సెకండియర్‌లోకి వెళ్లిన మెడికోలను కొత్త భవనాల్లోకి షిఫ్ట్ చేశారు. అక్కడ ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నా ఫస్టియర్ విద్యార్థులు రావడంతో సెకండియర్ విద్యార్థులను కొత్త హాస్టల్ భవనాల్లోకి షిఫ్ట్ చేయడం తప్పనిసరిగా మారింది. జీజీహెచ్ ఆవరణలో మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం బాలురు, బాలికలకు వేర్వేరుగా రెండు కొత్త హాస్టల్ భవనాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

ఫస్టియర్ తరగతులు ఆరంభం

ఫస్టియర్‌లో చేరిన మెడికోలకు సోమవారం నుంచి క్లాసులు ప్రారంభించారు. ముందుగా ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి ఇంట్రడక్షన్ క్లాసు తీసుకున్నారు. నిబంధనలు, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ వివరించారు. విద్యార్థుల సమాచారం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలేమైనా ఉంటే తనకు చెప్పాలని సూచించారు.హాస్టళ్ల భవన నిర్మాణ పనులు చాలా వరకూ పూర్తయ్యాయని, చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయని, వీటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరడం జరిగిందని సౌభాగ్యలక్ష్మి తెలిపారు.



కుంతీదేవి ఊరేగింపు

ఉండ్రాజవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల్లో భక్తులు అధికం.. అందుకే అందరు దేవతల ప్రతిష్ఠిస్తారు.. పూజిస్తారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో పాండవుల తల్లి పాండురాజు భార్య కుంతీదేవి ఆలయం ఉంది. ప్రతి ఏడాది దసరాలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది దసరా 9 రోజులు ఉత్సవాలు నిర్వహించారు.ప్రత్యేకంగా అలంకరించిన అంబారీ వాహనంపై సోమవారం అమ్మవారి విగ్రహం ఉంచి ఊరేగించారు. బ్యాండుమేళా, బాణాసంచాతో ఊరేగింపు ఘనంగా సాగింది. సర్పంచ్ మెండే లలితకుమారి, కమిటీ సభ్యులు జాతరను పర్యవేక్షించారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అప్పు తీర్చమంటే.. వైసీపీ నాయకుడి దాడి

ఈవెంట్ యాంకర్ కావ్య 7

19 నుంచి రైఫిల్ షూటింగ్ పోటీలు 8

ఇంత నిర్లక్ష్యమా!



ఒక లుక్కేయండి కలెక్టర్ మేడమ్ : రోడ్ కం రైలు బ్రిడ్జిపై పాడైన ఫుట్ పాత్..అందులో పేరుకుపోయిన చెత్త

ఈ చిత్రం ఎక్కడిదో గుర్తుపట్టారా! ఇలా ఉంటే ఏం తెలుస్తుంది లెండి.. అయితే ఎక్కడిదో తెలిస్తే మాత్రం అవాక్కవడం మీవంతవుతుంది.. ఎందుకంటే ఇది ఆషామాషీ వంతెన కాదండోయ్.. ఆసియాలోనే అతిపెద్ద రెండో రోడ్ కం రైలు బ్రిడ్జిపై దుస్థితి..
ఈ ఒక్క చిత్రం చాలు కొవ్వూరు- రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై నిర్మించిన వంతెన ఎంత అధ్వానంగా ఉందో చెప్పడానికి.. ప్రస్తుతం వంతెన చూస్తే డంపింగ్‌యార్డ్‌లా ఉంది.. ఎందుకంటే వంతెనపై ఎటు చూసినా చెత్త.. మరో వైపు పిచ్చిమొక్కలు.. ప్రతి రోజూ ఆ బ్రిడ్జిపై అటూ ఇటూ అధికారులు తిరుగుతూనే ఉంటారు.. అయినా కనీస చర్యలు శూన్యం.. అయ్యా అధికారులు ఇకనైనా కళ్లు తెరవండి.. - వివరాలు 8లో



ఆనం కళాకేంద్రం వద్ద బయట కూర్చున్న దరఖాస్తుదారులు

డ్రా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

లక్కీ క్వాయిన్ చూపుతున్న ఎక్సైజ్ అధికారి

లక్కీ ఛాన్స్!

125 షాపులు కేటాయింపు

- ప్రశాంతంగా మద్యం లాటరీ
- 9:30 గంటల పాటు నిర్వహణ
- లాటరీ మొత్తం వీడియో
- 16 మంది మహిళలకు షాపులు
- సిండికేటుదారుల మాయాజాలం
- ఆనం కళాకేంద్రం వద్ద సందడి
- లోన్లకు బ్యాంకుల క్యూ

రాజమహేంద్రవరం,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొందరికి లక్ కిక్ తగిలింది.. మరికొందరికి లక్ లేక నీరసం ఆవహించింది. నూతన మద్యం పాలసీ 2024-26కి సంబంధించి రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో సోమవారం లాటరీ ద్వారా నిర్వహించిన షాపుల కేటాయింపు ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో జేసీ చిన్న రాముడు, జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి లావణ్య స్వీయ పర్యవేక్షణలో 9.30 గంటల పాటు లాటరీ నిర్వహించారు. షాపు దక్కించుకున్న వారి నుంచి తొలి విడత ఫీజు జమ చేయించుకొని ప్రొవిజనల్ లైసెన్సు జారీ చేశారు. బుధవారం(రేపు) నుంచి ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి రానున్నాయి. సరుకు ఇప్పటికే డిపోలకు చేరుకొంది. జిల్లాలో 125 మద్యం షాపులకు 4384 దరఖాస్తులు అందిన విషయం తెలిసిందే. మద్యం షాపుల విషయంలో అధికార, ప్రతిపక్ష నేతలు ఒకే తాటిపైకి వచ్చి కలిసిమెలిసి 'పని' చేసు కుపోవడంతో కిక్కు అవాక్కయ్యింది.

ఉదయం 8 గంటల నుంచే..

లాటరీ ఉదయం 8గంటల నుంచి ప్రారంభించారు. ఓ గంట ముందుగానే దరఖాస్తుదారులు ఆనం కళా కేంద్రం వద్దకు చేరుకున్నారు. అప్పటికే బయట ఏర్పాటు చేసిన టెంట్లలో వేచి చూశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో మొదలుపెట్టి నిడదవోలు మునిసిపాలిటీతో సాయంత్రం 5.30 గంటల సమయానికి లాటరీ ముగించారు. ఎవరి వంతు వచ్చినప్పుడు వారిని లోపలకు పిలిచారు.లాటరీ టోకెన్లను ఆయా ఏరియా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో తీయించారు. లాటరీ ప్రక్రియను వీడియో తీయించారు. వేదిక వద్ద రెండు స్క్రీన్లు ఏర్పాటు చేసి టోకెన్లను ఉంచిన అట్టను చూపించి దరఖాస్తుదారులు ఓకే అన్న తర్వాతే ఆ టోకెన్లను ప్రత్యేకంగా తయారు చేయించిన డబ్బాలో వేసి అటూ ఇటూ మూడు సార్లు తిప్పి సంబంధిత ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓ టోకెన్ తీసి ప్రకటించారు. వెం టనే రిజర్వు 1, రిజర్వు 2 టోకెన్లను తీసి నెంబర్లు, పేర్లను ప్రకటించారు. ఒకవేళ లాటరీలో విజయం సాధించిన వారు నిర్ణీత సమయంలో ఫీజు చెల్లించకపోయినా, ఇతర నిబంధనలు ఉల్లంఘించినా తదరుపరి విజేతలుగా ఆర్ 1, వారూ విఫలమైతే తర్వాత ఆర్ 2ని పరిగణలోకి తీసుకుంటారు.



లక్ తగిలిందా : ఆనం కళాకేంద్రం వద్ద మహిళలు

మద్యం మహాలక్ష్ములు..

మద్యం షాపులకు దరఖాస్తులను కొందరు సెంటిమెంటుగా భావించి మహిళల పేరుతో సమర్పించారు. మద్యం లాటరీ ప్రాంగణంలో స్వల్పంగా మహిళ సంఖ్య కనిపించింది. రాజమహేంద్రవరం అర్బన్‌లో షాపు నెం.2 గుత్తుల సుబ్బలక్ష్మి, షాపునెం- మేకా ప్రభావతి, 27-టేకుమూడి ధనలక్ష్మి, బిక్కవోలు 35-తాళ్ల సత్యమౌనిక, దేవరపల్లి 48-ఈడుపుగంటి ఇంద్రాణి, కోరుకొండ 63-బొరుసు వీర నాగ వరలక్ష్మీస్వరూప, 65-సంపతి నాగలక్ష్మి, రాజమహేంద్రవరం రూరల్ 88-నిమ్మగడ్డ త్రివేణి, 91-బోళ్ల మౌనిక, 94- అంగర అరుణకుమారి, 97-నరేశ్ పద్మావతి, రాజానగరం 101 - కె.శరణ్య, సీతానగరం 108 - ఇళ్ల లక్ష్మి, తాళ్ళపూడి 113 - చేబోలు రామకుమారి, కొవ్వూరు 121-కొప్పుల సృజన, నిడదవోలు షాపు నెం.125 బొల్లం శివ పార్వతి పేరుతో షాపులు దక్కాయి. జిల్లాలోనే అత్యధికంగా గోపాలపురం మండలంలోని షాపు నెం.54కి 68, దేవరపల్లి మండలంలోని షాపు నెం.45కి 66 దరఖాస్తులు అందాయి. వీటికి సంబంధించి వరుసగా ఆలపాటి అరుణ్‌కుమార్, పేరిచర్ల సత్యనారాయణ రాజును విజయం వరించింది.

సిండి'కేటు'

మద్యం షాపులను అధికంగా సిండికేట్లు దక్కించుకోవడం బహిరంగ రహస్యంగా వినవచ్చింది. మద్యం షాపులకు అధికార ప్రతిపక్ష పార్టీల నాయకుల ఒక్కటైపోయినట్లు కనిపించింది. దీంతో సిండికేట్లలో ఇరు పక్షాల వాళ్లు ఉండడం గమనార్హం. ఆనం కళా కేంద్రం లోపల సాయంత్రం వరకూ రద్దీగానే ఉంది. షాపులు దక్కని వారు బయటకు వెళ్లాలని (మిగతా 8వ పేజీలో)

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ హెచ్చరికలపై కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్,భారీ వర్షాల నేపథ్యంలో రానున్న నాలుగైదురోజుల పాటు అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర క్షేత్రస్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకా శం ఉందని, అధికారులు విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని జాగ్రత్త వహించా లన్నారు. జిల్లాలో వరి కోతల వల్ల 2,555 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, అది ఓపెన్ మార్కెట్‌కు వెళ్లిందా లేదా అనేది నిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. గన్నీ బ్యాగ్స్ కేటాయింపు, వాహనాల ఏర్పాటు, హమాలీలు, ఆర్ఎస్‌కెలలో మౌలిక వసతులపై దృష్టి సారించాలని సూచించారు.

వర్షాలు ఉంటే.. వరి కోతలు వద్దు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు సోమవారం పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట కోతకు సమాయత్తంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 418 హెక్టార్లలో కోతలు జరిగినట్టు తెలిపారు. ఓపెన్ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నప్పటికీ గిట్టుబాటు ధర ఉండేలా చూసుకోవాలన్నారు. నూర్పిన ధాన్యాన్ని వర్షాలకు తడవకుండా సురక్షితమైన ప్రదేశాల్లో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో వరి కోతలు పూర్తిగా నిలుపుదల చేయాలన్నారు. పొలంలో నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికంగా వర్షాలు పడి తగ్గిన వెంటనే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులపై పడేవిధంగా పిచికారీ చేసి పక్వానికి వచ్చిన పంట సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీదారుడి సమస్య వింటున్న డీఆర్వో నరసింహులు

పీజీఆర్ఎస్‌కు 120 అర్జీలు

సత్వరం పరిష్కరించాలని డీఆర్వో ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ , అక్టోబరు 14: రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఆర్వో నరసింహులు అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 120 అర్జీలు ప్రజల నుంచి వచ్చినట్టు తెలిపారు.రెవెన్యూ శాఖ 47, వ్యవసాయ శాఖ 22, పోలీస్ శాఖ 15, పంచాయితీ రాజ్ 9, ఇతర శాఖలకు సంబంధించి 27 అర్జీలు స్వీకరించారు. పేపరుమిల్లు మాజీ ఉద్యోగి వి.శివరామకృష్ణ తదితరులు డిపాజిట్ చేసిన మొత్తాలకు సంబంధించి వడ్డీని పేపరుమిల్లు యాజమాన్యం చెల్లించడంలేదని యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని అర్జీపెట్టుకున్నారు. సంబంధిత అధికారులు కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కి 15 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్(మీ కోసం)లో ఎస్పీ నరసింహ కిషోర్ 15 అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.చట్ట పరిధిలో సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు.

పల్లెకు పండగొచ్చింది!

- 20వ తేదీ వరకూ పల్లె పండుగ
- 253 గ్రామాల్లో నిర్వహణ
- గ్రామ సభలో పనులకే ప్రాధాన్యం
- 999 పనులకు రూ.96.71 కోట్లు
- రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- సంక్రాంతికి పూర్తయ్యేలా చర్యలు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
పల్లెల్లో కూటమి పండగ ఆరంభమైంది. ఐదేళ్ల తర్వాత పల్లెలకు సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి పల్లె పండుగ వారోత్సవాలకు సోమవారం జిల్లాలో శ్రీకారం చుట్టారు. ఈ నెల 20వ తేదీ వరకూ 253 గ్రామాల్లో సమస్యలు పరిష్క రిస్తారు. జిల్లాలో ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామ సభల్లో గుర్తించిన పనులకు ప్రాధాన్యత ఇస్తారు. సం క్రాంతి నాటికి అయా పనులను పూర్తి చేసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి రూ.96.71 కోట్లతో 999 పనులకు పరిపాలనాపరమైన ఆమోదం లభించించింది. పంచాయతీ రాజ్ ద్వారా 698 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 301 సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలసి నిడదవోలు మండలం రావిమెట్లలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో మొత్తం 9 రోడ్లకు శంకుస్థాపన చేశారు.రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో మూడు చోట్ల ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పల్లె పండుగ నిర్వహించారు. పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ, హుకుంపేటలో పలు రోడ్ల పనులకు ఆయన భూమి పూజ చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతారాంపురం, నరేంద్రపురం, వెలుగుబంద, రామస్వామిపేట, రాజానగరం, సూర్యారావుపేట, చక్రద్వారబంధంలో పల్లె పండగ వారోత్సవాలు ప్రారంభించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బిక్కవోలు మండలం కొంకుదురు, మెళ్లూరు, ఆరికిరేవుల, అనపర్తి మండలంలోని పేరా రామచంద్రపురం, దుప్పలపూడి, లక్ష్మీనరసాపురం,అనపర్తి గ్రామాల్లో పల్లె పండగ పనులకు శంకుస్థాపన చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ద్వారకా తిరుమల మండలంలో పల్లెపండుగను ప్రారంభించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తాళ్లపూడి మండలంలో పల్లెపండగ పనులకు శంకుస్థాపన చేశారు.

గ్రామాల్లో పనులను తనిఖీ చేస్తా : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో చేపట్టిన పనులను సంబం ,దించి గోడలపై పెయింటింగ్ వేయించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు.పల్లె పండుగ కార్యక్రమంలో మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలన్నారు. జిల్లాలో కొత్తగా జాయిన్ అయిన ఎంపీడీవోలు రిపోర్టు చేసిన తరువాత మాత్రమే విధులు నిర్వహించాలని ఆదేశించారు.లేదంటే ఇప్పటి వరకు విధులకు హాజరుకానట్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనుల వివరాలు ప్రజలకు తెలిసేవిధంగా ప్రదర్శించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు పాల్గొనేలా చూడాలన్నారు.పల్లె పండుగ కార్యక్రమాలకు గైర్హాజరైతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మండలంలో సమస్య ఉన్న శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలన్నారు. అక్టోబరు 16 నుంచి ఓపెన్ ఇసుక రీచ్‌లు ప్రారంభం కానున్న దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తరువాత మాత్రమే తవ్వకాలు చేపట్టాలన్నారు.సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, సీపీవో ఎల్.అప్పలకొండ,వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీపీవో బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ అలీముల్లా, హార్టికల్చర్ అధికారి సుజాత కుమారి పాల్గొన్నారు.



పల్లె పండుగలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, టీడీపీ నాయకులకు సముదాయింపు

పల్లెలన్నీ అభివృద్ధి చేస్తాం : దుర్గేష్

నిడదవోలు,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.నిడదవోలు మండలం శింగవరం, కంసాలిపాలెం, రావిమెట్ల, తిమ్మరాజుపాలెం, సూరాపురం, కాటకూటేశ్వరం, ఉనకరమిల్లి, తాడిమళ్ళ, కోరుమామిడి గ్రామాల్లో సుమారు రూ.3 కోట్ల విలువైన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.20వ తేదీ వరకు వారం రోజుల పాటు పల్లెపండుగ వారోత్సవాలు జరుగుతాయన్నారు. గత వైసీపీ ప్రభు త్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచు కోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పల్లెల అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులు నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

మంత్రి దుర్గేష్‌తో టీడీపీ నేతల వాగ్వాదం

తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని కనీసం సమా చారం కూడా ఉండడం లేదంటూ మంత్రి దుర్గేష్‌ను కంసాలిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి తమకు సరైన సమాచారం ఉండడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఆహర్నిశలు శ్రమించినా కనీస గుర్తింపు లేదన్నారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంత్రి దుర్గేష్ టీడీపీ నాయకులకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.



ఉప్పాడ తీరంలో మత్స్యకారుని వలకు పెద్ద మండ పీత చిక్కింది. కిలో బరువున్న మండపీతను రూ.900కు తీరప్రాంతానికి చెందిన వ్యక్తే కొనుగోలు చేయడం విశేషం. - కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)



లిక్కర్ దుకాణాల డ్రాలో ఈసారి మహిళలు ఎక్కువగానే పాల్గొన్నారని తేలింది. చివరకు డ్రాలో గెలిచిన వారిలోనూ తామేమీ తక్కువ కాదన్నట్టు షాపులు దక్కించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 16 మంది మహిళలు మద్యం షాపులు దక్కించుకోగా, కాకినాడ జిల్లాలో ఆరుగురు దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో ఐదు షాపులు దక్కించుకున్నారు.



పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంటే!

పెళ్లంటే ఇది వరకు ఉన్న సంప్రదాయం వేరు. ఇప్పుడు వేరు. పూర్వం ఐదు రోజుల పెళ్లిళ్లు జరిగేవని పెద్దలు చెబుతుంటే వినేవాళ్లం. తర్వాత ఒక రోజు పెళ్లి తంతు వరకూ వచ్చేసింది. కానీ ఇప్పుడు మళ్లీ ట్రెండ్ మారింది. పెళ్లి పేరుతో ఐదు రోజులేంటి. డబ్బుంటే వారం రోజులూ ఒకటే హడావుడే. సామాన్య కుటుంబాలు సైతం లక్షల్లో వివాహ వేడుకల కోసం ఖర్చు పెట్టేస్తున్నారు. మధ్యతరగతి వారు ఉన్నత వర్గాలతో పోటీపడుతున్నారు. ధనవంతులైతే ఓ చిన్న సినిమా బడ్జెట్‌తో సమానంగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లి పిలుపుల నుంచి వివాహ వేదికల వరకు, ప్రీ వెడ్డింగ్ షూట్ల దగ్గర మొదలైన సందడి ముహూర్తం రోజు దాకా ఒక్క తంతు కాదు జరిగేది.. సంగీత్, మెహందీ, బ్యాచిలర్ పార్టీల దాకా వేల నుంచి లక్షల దాకా ఖర్చే ఖర్చు. ఇక వివాహం రోజు.. వివాహ వేదిక, విద్యుత్, పూల అలంకరణలు, విందు భోజనాలు, అతిథుల బస, రిటన్ గిఫ్టుల పేరుతో చేసే వ్యయం పెళ్లి బడ్జెట్‌ను అంచనాలకు మించిపోతోంది. మా పిల్లల పెళ్లి.. ఆడంబరంగా చేసుకోకపోతే ఎలా అని కొందరు సంబరపడుతుంటే, వివాహ తంతు పూర్తయ్యాక బడ్జెట్ లెక్కలేసుకుని లబోదిబోమంటున్న వారెందరో.. అందుకే పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంటున్నారు ప్రతి ఒక్కరూ.. మరి మీ బడ్జెట్ ఎంతేంటి..

- మొదలైన పెళ్లిళ్ల సందడి.. ఈ మూడు నెలలూ ముహూర్తాల పంట.. అన్ని వ్యాపారాలకూ జోష్
- వివాహాల పేరిట లక్షల్లో వ్యయం.. పరపతి చాటుకునే వివాహ వేడుకలు.. విందు భోజనాలు
- రంగంలోకి మ్యారేజ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్లు.. సొమ్ములిస్తే చాలు అన్నీ సిద్ధం చేస్తామంటూ రెడీ



పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు..

పచ్చని పందిళ్లు.. విద్యుత్ దీపాలంకరణలతో ఏ వీధికి వెళ్లినా పెళ్లి సందడే. వరుసగా మూడు నెలలపాటు పెళ్లి ముహూర్తాలు రావడంతో ఓవైపు పురోహితులు, మరోవైపు ఫొటో, వీడియోగ్రాఫర్లు, కేటరింగ్ పనివారలకు చేతినిండా పనే. ఏ ఇంట చూసినా ఇప్పటికే నాలుగైదు శుభలేఖలు పెళ్లిళ్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ జోరందుకోవడంతో ఓవైపు బంగారు నగల వ్యాపారం మరోవైపు వస్త్ర వ్యాపారాలతోపాటు అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. కల్యాణ మండపాలకు యమ డిమాండు ఏర్పడింది. ముహూర్తాలు పెట్టుకున్న సమయంలోనే ముందుగా కల్యాణ మండపాలను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలపాటు ఉన్న పెళ్లి ముహూర్తాల గురించి బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వర రావు సిద్ధాంతి వివరించారు. ప్రస్తుత ఆశ్వయుజ మాసమైన అక్టోబరులో ఈ నెల 16న సాయంత్రం 6.52 గంటలకు, రాత్రి 12.06 గంటలకు, 17న రాత్రి 8.16 గంటలకు, 20న రాత్రి 10.54 గంటలు, 26న రాత్రి 10.30 గంటలకు, 27న ఉదయం 7.58 గంటలకు పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాసం. నవంబరు 3వ తేదీ రాత్రి 7.08 గంటలకు, 9.58 గంటలకు, 6న ఉదయం 7.18 గంటలు, 9న రాత్రి 6.45 గంటలకు, 10న ఉదయం 7.03 గంటలకు, 13న ఉదయం 6.52 గంటలకు, 14వ తేదీ ఉదయం 6.48 గంటలకు, రాత్రి 6.26 గంటలకు, 22న రాత్రి 8.44 గంటలకు, తెల్లవారుజామున 5.20 గంటలకు పెళ్లి ముహూర్తాలున్నాయి. డిసెంబరు 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిరమాసమని, డిసెంబరు 4న రాత్రి 7.57 గంటలు, 5న తెల్లవారుజామున 4.29 గంటలకు, 6న తెల్లవారుజామున 4.25 గంటలకు, 7న రాత్రి 7.45 గంటలకు, తెల్లవారుజామున 4.21గంటలకు, 10న తెల్లవారుజామున 4.09 గంటలకు, 11న తెల్లవారుజామున 4.06 గంటలకు, 20న రాత్రి 3.31 గంటలకు, 25న తెల్లవారుజామున 4.08 గంటలకు పెళ్లి ముహూర్తాలు ఉన్నట్టు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

- అమలాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)



పూల పందిరిలో...

మీరు నిండు మనస్సుతో వచ్చి మూడుముళ్ల బంధంతో పచ్చని పందిరిలో ఒకటి కాబోతున్న జంటకు మీ చల్లని చేతులతో అక్షింతలు వేసి దీవించి మనసారా ఆశీర్వదించండి.. ఒకప్పుడు శుభలేఖలో అతిథులకు పలికే స్వాగత పలుకులు ఇలా ఉండేవి.. ఆరోజు వచ్చిన బంధుమిత్రులకు ఎదురేగి స్వాగతం పలికి పచ్చని పందిట్లో మేళతాళాల మధ్య వేద మంత్రాల సాక్షిగా ఒక్కటయ్యే నవ దంపతులకు ఆశీర్వచనాలు పొందడం, అరిటాకులో విందు భోజనం ఆరగించి వీడ్కోలు తీసుకోవడం జరిగేది. ఇప్పుడు పెళ్లంటే.. సాదాసీదా కాదు, పచ్చని పందిట్లో సందడిగా సాగిపోయే తంతు కాదు.. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు హోదాకు తగినట్టు, తమ స్తోమతను చాటుకునేలా అంగరంగ వైభవంగా వివాహాలు జరిగిపోతున్నాయి. వేలల్లో ఖర్చుతో జరిగే పెళ్లిళ్లు లక్షల్లో వ్యయమవుతున్నాయి. ధనికుల ఇళ్లల్లో అయితే కోట్లలో ఖర్చు పెట్టేస్తున్నారు. ఆహ్వాన పత్రిక మొదలుకొని పెళ్లికి బంగారం, ఖరీదైన పట్టు చీరలు, వచ్చిన అతిథులకు ఆహా ఏమిరుచి అన్నట్టు ఎన్నెన్నో వంటకాలతో విందు భోజనాలు, వివాహానికి ఖరీదైన వేదికలు, అద్భుతమైన సెట్టింగులు, పూలతోటల మాదిరిగా అలంకరణలు.. వీటన్నింటిని కెమెరాలో బంధించేలా వీడియో, ఫొటోగ్రఫీ. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్లు.. ఒక సినిమా తీసినంత అట్టహాసంగా షూటింగ్.. చెప్పాలంటే పెళ్లంటే ఇవాళ ఒక భారీ బడ్జెట్ సినిమా. గతంలో ఐదు రోజుల పెళ్లిళ్లు జరిగేవి. తర్వాత మూడు రోజులకు, తర్వాత ఒక రోజుకి చేరాయి. ఇప్పుడు పెళ్లికి ముందు, తర్వాత కలిపి కనీసం ఐదు రోజులకు తగ్గకుండానే ఒక్కొక్క వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది వరకు ఓ మాదిరి పెళ్లంటే ఒక లక్ష లేదా రెండు లక్షల ఖర్చు. ఇప్పుడు సామాన్యులైతే రెండు మూడు లక్షలు.. మధ్యతరగతి అయితే కనీసం పది లక్షలు.. కాస్త కలిగిన వారైతే ఇరవై.. ధనికులైతే రూ.40 లక్షల నుంచి కోటి వరకు అవుతోందని మ్యారేజ్ ఈవెంట్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇది వరకు బంధువులే కాస్త ముందు వచ్చి పెళ్లి ఏర్పాట్లు చూసేవారు. ఇప్పుడు మ్యారేజ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ అంటూ ఒక వ్యవస్థే వచ్చి కూర్చుంది. బడ్జెట్‌ను బట్టి పెళ్లి.. ఎంత ఘనమైతే అంత ధర. దీంతో అబ్బా ఫలానా పెళ్లికి వెళ్లాం.. ఏముందిరా మండపం.. ఏ మున్నాయిరా భోజనాలు.. ఎవరికి ఆర్డర్ ఇచ్చారంటావు? చాలా బాగున్నాయిరా.. అని పెళ్లికి వచ్చిన వారి చర్చోపచర్చలు. ఈ కామెంట్ కోసం లక్షలు ఖర్చు పెట్టామని పెళ్లివారూ జబ్బలు చరుచుకోవడం చూస్తూనే ఉన్నాం. కానీ ఈ ఘనమైన పెళ్లిళ్ల సందడిలో మధ్యతరగతి వారూ పరుగులు పెట్టి ఆనక లబోదిబోమనడం కూడా చూస్తున్నాం.

'మహా' విందులు..

వివాహాది శుభకార్యాలకు వధూవరుల కుటుంబాలు ఏర్పాటుచేస్తున్న విందులు ఆహా.. భోజనంబు అన్న రీతిలో అబ్బురపరుస్తున్నాయి. వివాహం ఎంత డెకరేటివ్‌గా చేశామన్నది ప్రధానమైతే, ఎంత ఘనంగా భోజనాలు పెట్టామన్నది మరో ముఖ్యమైన విషయమైంది. అసలే గోదావరి జిల్లాలు.. భోజనాల్లో 'స్పెషాలిటీ' ఉండనే ఉంటుంది. దానికి తోడు ఎన్ని వెరైటీలు భోజనం మెనూలో ఉన్నాయనేది ఈమధ్య స్టేటస్‌కు సింబల్‌గా మారింది. దానికోసం ఖర్చుకు వెనుకాడడం లేదు. విందు భోజనాల్లో పది నుంచి 20 రకాలపైబడి ఆహార పదార్థాలు విస్తరిలో వడ్డిస్తారు. విజిటేబుల్ బిర్యాని, ఫ్రైడ్‌రైజ్, జీరా రైస్, వాము రైస్, కొరియాండర్ రైస్, టమాటోరైస్, లెమన్ రైస్, కోకోనట్ రైస్, పులిహోరా, వైట్ రైస్ మొదలెడితే అర డజను రకాల కూరలు, ఫ్రై, రసం, సాంబారు, పులుసులు ఇలా ఓ పది అయిటమ్స్ అన్నా వేసేస్తున్నారు. స్వీట్లు, ఐస్ క్రీమ్స్, పాన్‌లు వంటివి ప్రత్యేక కౌంటర్‌లే ఏర్పాటుచేస్తున్నారు. స్వీట్లు కూడా పూత రేకులు మొదలుకొని తాపేశ్వరం కాజా వరకు సుమారు ఐదు నుంచి పాతిక రకాల స్వీట్లను అందుబాటులో ఉంచుతున్నారు. భోజనాలతోపాటు అల్పాహారాలను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. మినపరొట్టెలు, పొట్టిక్కలు, చిట్టి గారెలు, ఇండ్లీ సాంబరు, ఉప్మా పెసరట్టు, మినీ పూరీలు, ఉల్లిబజ్జీలు అవీ డజను రకాలు.. వేడివేడిగా తయారుచేసి వడ్డించే ఏర్పాట్లు చేస్తున్నారు. విందు భోజనాలకు లక్ష నుంచి మూడు లక్షలు వరకు సామాన్య, మధ్యతరగతి వారు, ఉన్నత వర్గాల వారు పాతిక లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. క్యాటరింగ్ సంస్థలు ప్లేటుకు రూ.300 నుంచి రూ.2 వేల దాకా విందు భోజనాలకు చార్జి చేస్తున్నారంటే భోజన బడ్జెట్ ఎంతో మీరే లెక్కలేసుకోండి.

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)



మండపం ఖర్చు 10 లక్షల దాకా..

పెళ్లి మండపం ఖర్చు అక్షరాలా 10 లక్షలు పైమాటే అంటే ఆశ్చర్యపోతున్నారా.. ఇది నిజం. ఖరీదైన ఇలాంటి మండపం తయారీకి పూలు ఊటీ, కేరళ ప్రాంతాల నుంచి తీసుకొస్తారు. ఈ మండపాన్ని పెళ్లికి 4 నుంచి 6 రోజుల ముందు నుంచే తయారుచేయడంలో పూలడెకరేటర్లు నిమగ్నమై ఉంటారు. ఇందుకు బెంగళూరు నుంచి కార్నిషియా, ఆర్కిడ్స్, విలియమ్స్, హెల్కోనియా, బ్లూడైజ్, సాంగ్ ఆఫ్ ఇండియా, డ్రసేనియా, క్రిసాంతిమం, స్నోబాల్ తదితర ఖరీదైన అందమైన పూలను తీసుకువస్తారు. వివాహానికి హాజరయ్యే బంధువులు వచ్చే కల్యాణమండపం ద్వారం నుంచి పూలతో అలంకరణ మొదలవుతుంది. ప్రస్తుతం పెళ్లికుమార్తె మంగళ స్నానంతో ఇచ్చే పూల నుంచి పెళ్లి మండపం, మొదటిరాత్రి గది అలంకరణ వరకు మొత్తం పూలు, మండపం వరకు తామే అలంకరణ చేసే విధంగా ఆర్డర్లు వస్తున్నాయని డెకరేటర్లు చెబుతున్నారు. వేదికను బట్టి యాభై వేల నుంచి పదిహేను లక్షల దాకా పూల డెకరేషన్ ఖర్చు అవుతుందని చెబుతున్నారు. - కడియం (ఆంధ్రజ్యోతి)



పెళ్లంటే తప్పెట్లు తాళాలు కాదు.. వీడియో షూట్లు.. ఫొటో సెషన్స్

పెళ్లిళ్లు అనగానే వేద మంత్రాలు, బాజాభజంత్రీలతో చేసే సందడి ఒక్కటే కనిపించేది.. ఇప్పుడు పెళ్లి అంటే పూర్తిగా ఫొటో, వీడియో షూట్లు. అదృష్టం బాగుంటే అప్పుడప్పుడూ పెళ్లి సందడి మనకు కనిపిస్తే వీక్షించి ఆనందించొచ్చు. జీలకర్ర బెల్లం వేళో, సూత్రధారణ సమయంలోనో నాలుగు అక్షితలు వేయడానికి క్యూ లైన్లలో నుంచి వధూవరుల వద్దకు వెళ్లినా పక్కకు జరగండనో, ఫొటోకు ఫోజువ్వమనో ఆర్డర్లు వినిపిస్తాయి. పెళ్లి జీవితంలో మరపురాని మధురానుభూతి. దాన్ని పదికాలాలు దాచుకునేలా ఫొటోలు, వీడియోలు తీయించుకోవడమూ సబబే. కానీ పెళ్లికి ముందు ప్రివెడ్డింగ్ షూట్లు, మెగా ఈవెంట్ మాదిరి పెళ్లి వేడుకల రికార్డింగ్ హడావుడి మధ్య పెళ్లి తంతు ముగుస్తోంది. దీనికి కూడా లక్ష నుంచి పది లక్షలపైనే వసూలు చేసే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ఫొటోగ్రాఫర్లు ఉన్నారంటే ఆశ్చర్యపోనవసరం లేదు.



డాగ్ 'షో'

కుమార్తెకు ప్రేమతో..

చైనా నుంచి కాకినాడకు..

సింహాన్ని తలపిస్తున్న చౌచౌ

విశ్వాసానికి మారుపేరుగా శునకాలు నిలుస్తాయి. పలువురు వారి ఆర్థిక పరిస్థితులను బట్టి లక్షలు వెచ్చించి శునకాలను దేశ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఇళ్లల్లో పెంచుకుంటున్నారు. కాకినాడకు చెందిన మాజీ కార్పొరేటర్ కోరుమిల్లి బాలప్రసాద్ లక్షలు విలువ చేసే జాగిలాన్ని చైనా నుంచి కొనుగోలు చేసి తన కుమార్తెకు బహుమతిగా అందించారు. చూసేందుకు సింహాన్ని తలపిస్తున్న ఈ జాగిలం చౌచౌగా పిలిచే చైనాకు చెందింది. గంభీరంగా కనిపిస్తున్న వీటి ధర కూడా అదే స్థాయిలో లక్షల్లో ఉంటుంది. ఇంటి కాపలాలో దీనికి ఇదే సాటి. 8 నుంచి 12 ఏళ్ల జీవితకాలం ఉన్న ఈ జాతి శునకాలు చలి ప్రదేశాల్లో ఎక్కువగా జీవిస్తాయి. వీటి నాలుక నీలి రంగులో ఉంటుంది. అయిదేళ్ల కిందట తన కుమార్తె పదో తరగతి పాసైనందుకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు బెంగుళూరు, ఢిల్లీ నుంచి రూ.2.40 లక్షలు వెచ్చించి రెండు శునకాలు కొనుగోలు చేశారు. ఇవి చూడ్డానికి సింహాల్లా ఉండడం విశేషం.

- కాకినాడ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)





నేడు గ్రామీణ మహిళా దినోత్సవం..





దుమ్మిరి భీమమ్మ రచించిన కోయ పద్యం కిల్లోర్కె.. కోయబాల సాహిత్య రచయిత్రి దుమ్మిరి భీమమ్మ

నాటి నిరక్షరాస్యురాలే.. నేటి రచయిత్రి!

స్ఫూర్తిగా నిలిచిన ఆదివాసీ మహిళ దుమ్మిరి భీమమ్మ

భావితరాలకు కోయబాల' సాహిత్యం

అదే ఆమె లక్ష్యం

దుమ్మిరి భీమమ్మ.. ఓ ఆదివాసీ మహిళ. ఎనిమిది మంది సంతానంలో ఆరవది. ఇపుడామె వయసు 51 ఏళ్లు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన భీమమ్మను చదివించే ఉద్దేశం తల్లిదండ్రులకు లేదు. అంటే అంతటి స్తోమత లేదన్నమాట. అయితే తమ్ముడు బడికి వెళ్లనంటూ మారాం చేస్తుండడంతో తమ్ముడికి తోడుగా భీమమ్మను తల్లిదండ్రులు బడికి పంపించేవారు. అట్లా భీమమ్మ తన తమ్ముడితోపాటే ఐదో తరగతి వరకు చదువుకుంది. ఆ తర్వాత తమ్ముడు బడికి సవ్యంగా వెళ్లడం అలవాటుపడ్డాడు. దీంతో భీమమ్మను ఆమె తల్లిదండ్రులు ఇంటి పనులకే పరిమితం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం రామన్నపాలేనికి చెందిన భీమమ్మ తనకు చదువుపై ఆసక్తి ఉన్నా చేసేదేమీ లేక మిన్నకుండిపోయింది. చివరకు వ్యవసాయ పనుల్లో భాగమైంది.

● ఇరవై మూడేళ్లకు మళ్లీ చదువు

హైదరాబాద్‌కు చెందిన ఓ ఎన్జీవో సంస్థ చింతూరు మండలం చట్టిలో చదువురాని యువతీ, యువకులను సమీకరించి వారితో ఏడో తరగతి పరీక్షలు రాయించడం మొదలుపెట్టింది. వారందరికీ భోజన వసతి కూడా కల్పించారు. విషయం తెలుసుకున్న భీమమ్మ వారిని ఆశ్రయించింది. ఈ క్రమంలో ఆమె ఏడో తరగతి పాసైంది. తోటి వారంతా పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతామని ఎన్జీవో నిర్వాహకులకు చెప్పుకున్నారు. అయితే తమ ప్రాజెక్టు పూర్తయిందని వారు నిష్క్రమించారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

● సొంతంగా ఆశ్రమ పాఠశాల

ఎన్జీవో తరఫున అప్పటివరకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు గంగదేవి యాదయ్య, పాండు కామ్డెకర్.. భీమమ్మలాంటి పలువురు విద్యార్థుల తపన చూసి ఏదో చేయాలన్న ఆలోచనకొచ్చారు. భీమమ్మ లాంటివారు 55 మంది పోగయ్యారు. వారంతా కలిసి రామన్నపాలెంలో తలోకొంత సొమ్ము జమ చేసుకుని అటవీ కలపతో ఒక ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసుకున్నారు. తమకు వేతనాలొద్దంటూ యాదయ్య, పాండు వారితో పాటే ఆశ్రమ పాఠశాలలో ఉంటూ పాఠాలు చెప్పారు. భీమమ్మ పదో తరగతి కూడా పాసైంది. అక్కడితో ఆగని ఆమె ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది.



భీమమ్మ రచించిన కోయ పద్యం మిడికోస్

● కోయబాల సాహిత్యంపై మక్కువ

అంచెలంచెలుగా కోయత్తోర్ బాట (ఆదివాసీల దారి) ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించింది. అదే దశలో భీమమ్మ సాహిత్యంపై మక్కువ పెంచుకుంది. కాలక్రమంలో తమ ఆదివాసీ భాష కనుమరుగైపోతున్న తీరుని ఆమె పసిగట్టింది. సంప్రదాయాలు, ఆచారాలకు పుట్టినిల్లుగా ఉన్న కోయభాషను ఆదివాసీ భావితరాలకు అందించాలన్న తపన భీమమ్మలో మొదలైంది. దీంతో ఆమె కోయ సాహిత్యంపై దృష్టి సారించింది. అదే తన లక్ష్యంగా మలచుకుంది. అందుకు యాదయ్య, పాండు కూడా సహకారమందించారు. దీంతో కోయబాల సాహిత్యంపై భీమమ్మ అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇపుడామె కలం నుంచి పలు కథలు, పద్యాలు, పాఠాలు రూపుదిద్దుకుంటున్నాయి. అవన్నీ కోయ భాషలోనే.

● ప్రతి చప్పుడూ ఓ కథే

ప్రతి జీవరాశి నుంచి వెలువడే శబ్దం ఆమె కోయబాల సాహిత్యంలో పద్యం, పాటగా రూపుదిద్దుకుంటున్నాయి. కిల్లోర్కె, మిడికోస్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో గిరిజన సాహిత్య రచనలకు ఆమె శ్రీకారం చుట్టింది. చివరకు మొన్నటి నిరక్షరాస్యురాలు నేడు సాహిత్య రచయితగా పలువురి ప్రశంసలు, మన్ననలు సొంతం చేసుకుంటోంది. - చింతూరు (ఆంధ్రజ్యోతి)



కోయబాల సాహిత్య కార్యశాలలో భీమమ్మను సన్మానిస్తున్న ఆదివాసీ మహిళలు (పాత చిత్రం)

పట్టుదలతో.. పరిశ్రమ

ప్రభుత్వ ప్రోత్సాహంతో రాణిస్తున్న వివాహిత

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తగా అడుగులు



రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలో ప్లాస్టిక్ బాటిల్స్ తయారీ.. పక్కన మందపల్లి ధనలక్ష్మి



కాకినాడ జిల్లాలో ఎంఎస్ఎంఈ ద్వారా లబ్ధిపొందిన పారిశ్రామికవేత్తలు సుమారు 13 వేల మంది ఉన్నారు. ఇందులో మహిళా పారిశ్రామికవేత్తలు 3800 వరకు ఉన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి పొందుతూ పలువురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలోని రమణయ్యపేట గ్రామం బాపన్నదొర కాలనీకి చెందిన మందపల్లి ధనలక్ష్మి ఇందులో ఒకరు. ఈమె డిగ్రీ పూర్తి చేసి ఎంబీఏ చదువుతున్నారు. ఈమె భర్త నవీన్ డ్రైవర్. ఇద్దరు పిల్లలు. భర్త సంపాదనకు తోడుగా తాను ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలవాలని భావించి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ తయారీలో రెండేళ్లపాటు పనిచేసి ధనలక్ష్మి నైపుణ్యం సాధించింది. సొంతంగా పరిశ్రమ ఏర్పాటుచేయాలన్న ఆలోచనతో జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న పథకాలపై సమాచారాన్ని సేకరించింది. జిల్లా పరిశ్రమలశాఖ అధికారుల వద్దకెళ్లి సొంతంగా ప్లాస్టిక్ బాట్లింగ్ తయారీ యూనిట్ నెలకొల్పాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. 2023లో డీపీఆర్ తయారుచేసి పీఎంఈజీపీ పథకంలో యూనిట్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంది. యూనిట్ ఖరీదు రూ.35 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రూ.12 లక్షల రాయితీగా, లబ్ధిదారుని వాటా సొమ్ము 5 శాతం చెల్లించి 2024 ఫిబ్రవరిలో రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్లాస్టిక్ బాట్లింగ్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. పలువురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ స్వయం ఉపాధి పొందుతూ ఆమె ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. సొంతంగా పరిశ్రమ ఏర్పాటుచేయాలన్న కోరిక, నైపుణ్యం ఉంటే యూనిట్లు మంజూరుకు పరిశ్రమల శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారని ధనలక్ష్మి తెలిపారు.

- సర్పవరం జంక్షన్(ఆంధ్రజ్యోతి)

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు

కరప విద్యార్థిని యస్మిత నాగమహి ఎంపిక



కరప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కాకినాడ జిల్లా కరప విద్యార్థిని ఎంపికైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.యస్మిత నాగమహి బాలికల జూనియర్ అండర్-17 కేటగిరీలో నేషనల్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16 నుంచి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగే బాలికల సౌత్‌జోన్ ఖేలో ఇండియా మ్యాచ్‌కు రాష్ట్రం తరపున ఈమె ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి గ్రామానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. యస్మిత నాగమహిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పీఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, హెచ్‌ఎం, పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తీక మాసం రద్దీ నేపథ్యంలో

రత్నగిరిపై క్యూలైన్లు, వ్రత మండపాల పరిశీలన

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న ప్రారంభమయ్యే కార్తీక మాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పన, లోటుపాట్లపై ఈవో రామచంద్రమోహన్ సోమవారం పరిశీలించారు. ముందుగా క్యూ లైన్లు, వ్రత మండపాలను చూశారు. ఒక్కో మండపంలో ఎంతమంది భక్తులు వ్రతమాచరించుకునే వీలుందో ఆరా తీశారు. మండపాల లోపలి భాగంలో ఏర్పాటు చేసిన నూతన క్యూలైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ, పోలీసు, మిగిలిన శాఖల అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించేందుకు మినిట్స్ సిద్ధం చేయాలని సూచించారు.



రాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న కమిషనరు సత్యనారాయణ దంపతులు

పాదగయలో దేవదాయ శాఖ కమిషనరు పూజలు

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ సతీసమేతంగా సోమవారం సాయంత్రం సందర్శించారు. కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించారు. కమిషనరు దంపతులను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనరు రమేష్‌బాబు, ఆలయ సూపరింటెండెంట్ వీరభద్రరావు శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. శిష్టికరణాల వీధిలోని పురుహూతికా అమ్మవారిని



దర్శించుకున్నారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను దర్శించుకున్నారు. కమిషనరు దంపతులకు కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.





ధ్వంసమైన సరస్వతీ దేవి విగ్రహం, తొలగించిన దిమ్మ

సరస్వతీ దేవి విగ్రహం ధ్వంసం

లంపకలోవ హైస్కూల్లో దుండగుల దుశ్చర్య

పోలీసులు రంగప్రవేశం... క్లూస్ టీమ్ పరిశీలన... హైందవ సంఘాల ఆగ్రహం

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ జడ్పీ హైస్కూలులోని సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. హైస్కూలు ప్రాంగణంలో దశాబ్దం క్రితం అప్పటి వార్డెన్ ఎం.మధుసూదనరావు సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా అప్పటి విద్యా కమిటీ చైర్మన్ సిగిరెడ్డి భక్తాంజనేయ ఆవిష్కరించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని దిమ్మ నుంచి వేరుచేసి దారుణంగా ధ్వంసం చేశారు. దసరా సెలవులు ముగిసి సోమవారం స్కూలు వచ్చిన వెంటనే విగ్రహాన్ని చూసిన వాచ్‌మెన్, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడు కేవీ రాఘవకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్‌ఎం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీకాంతం, సిబ్బంది వచ్చి పరిశీలించారు. కాకినాడ నుంచి వచ్చిన క్లూస్ టీమ్ విగ్రహ ధ్వంస పరిసరాల్లో దుండగుల ఆధారాల లభ్యం కోసం పరిశీలించింది. సరస్వతీ దేవి విగ్రహ ధ్వంసంపై మండలంలోని హైందవ సంఘాలు, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

పిఠాపురం పురపాలక సంఘంలో

త్రిసభ్య కమిటీ విచారణ

కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘంలో కమిషనరు, డీఈఈ మధ్య జరిగిన వాగ్వాదంపై అమరావతి నుంచి వచ్చిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు సోమవారం విచారణ చేపట్టారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. ఇద్దరు అధికారులనూ మార్చాలని పలువురు కౌన్సిలర్లు కోరారు.

కమిషనరు, డీఈఈ వివాదంపై వివరాల సేకరణ .... ఇద్దరు అధికారులనూ మార్చాలని కౌన్సిలర్ల వినతి

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆగస్టు 31వ తేదీన కమిషనరు కనకారావు, డీఈఈ భవానీప్రసాద్ కౌన్సిల్ సభ్యుల సాక్షిగా వాగ్వివాదానికి దిగి ఒకరిని ఒకరు తోసుకోవడంతో పాటు కొట్టుకున్నారు. అందరూ తలదించుకునే విధంగా బూతులు తిట్టుకున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కోసం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పి.పూర్ణచంద్రరావు, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఎం.బ్రహ్మాజీ, టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు బి.శ్రీనివాసులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు సోమవారం పిఠాపురం పురపాలక సంఘానికి వచ్చి కౌన్సిల్ సమావేశంలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. పుర-పరిపాలన శాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహరావుతో పాటు ఆగస్టు 31న కౌన్సిల్ సమావేశానికి హాజరైన పలువురు కౌన్సిలర్లు, మునిసిపల్ వైస్ చైర్మన్-2 కొత్తపల్లి పద్మ, అధికారులు, సిబ్బంది నుంచి ఆ రోజు జరిగిన ఘటనపై వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. కమిషనరు, డీఈఈ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. సదరు ఘర్షణలో డీఈఈని సస్పెండ్ చేసి కమిషనరుపై చర్యలు తీసుకోకపోవడాన్ని కౌన్సిలర్లు తప్పుపట్టారు. డీఈఈ ఉండగా ఎటువంటి లిఖితపూర్వక ఉత్తర్వులు లేకుండా మరొక డీఈఈతో అనధికారికంగా ఎలా పనిచేయించుకుంటారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించిన ఏడుగురు ఉద్యోగుల నియమకాలు రద్దు చేయమని తాము తీర్మానం చేశామని, కాని వారికి జీతాలు చెల్లించారని తెలిపారు. కమిషనరు వ్యవహారశైలిపై పలు ఆరోపణలు చేశారు. అందరినీ కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, ఉద్యోగులను దుర్భాషలాడుతున్నారని లిఖితపూర్వకంగా తెలిపారు. ఆనాటి సమావేశంలో ఏమి జరిగిందో తాము గతంలోనే మునిసిపల్ ఆర్డీకి తెలియజేసినా ఏకపక్షంగా ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకున్నారని చెప్పారు. కమిషనరుపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనరు, డీఈఈలను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని పలువురు కౌన్సిలర్లు విచారణాధికారులను కోరారు. సమర్థులైన అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

తాము తిరస్కరిస్తే ఆమోదించినట్టు రాశారు...

ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశం అజెండాలో ర్యాటిఫికేషన్‌లకు సంబంధించి 22 అంశాలను తాము రద్దు చేశామని, వాటిపై కౌన్సిలర్లతో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానం చేశామని కౌన్సిలర్లు తెలిపారు. అయితే మినిట్స్‌లో మాత్రం ఈ 22 అంశాలను ఆమోదించినట్టు రాశారని చెప్పారు. కౌన్సిల్ తిరస్కరించిన విషయాలను ఆమోదించినట్టు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వాటిని తిరస్కరించినట్టు నమోదు చేయాలని అధికారులను కోరారు. కాగా తాము అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశామని, కమిషనరు, డీఈఈని విచారించామని, నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పూర్ణచంద్రరావు చెప్పారు.



కౌన్సిలర్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న త్రిసభ్య కమిటీ సభ్యులైన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి బాలుడి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... కాకినాడ ఎల్‌బీ నగర్ ఐదో వీధిలో రైస్‌మిల్లు ఎదురుగా గల రేకుల షెడ్డులో కుక్కల మల్లేశ్వరరావు భార్య, కుమారుడు చరణ్ శ్రీతేజ (13) కలిసి ఉంటున్నాడు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చరణ్ శ్రీతేజ అశోక్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి సమీపంలో ఉన్న రాజేశ్వరి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోకి ఆడుకునేందుకు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే అపార్ట్‌మెంట్ నుంచి కింద పడి మృతి చెందాడు. విషయం తెలిసిన సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు సంఘటనాస్థలానికి చేరుకుని బాలుడు మృతదేహాన్ని పరిశీలించారు. అపార్ట్‌మెంట్ వాసులు, వాచ్‌మెన్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుమారుడిని ఎవరో పై నుంచి తోసేయడంతోనే మృతి చెంది ఉంటాడని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. అక్కడే ఉన్న సీసీ పుటేజీలో చరణ్ శ్రీతేజ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లడాన్ని పోలీసులు పరిశీలించారు. బాలుడి బాబాయి వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించినట్టు తెలిపారు. కాగా ఇదే రూటులో వెళ్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను మృతుని బంధువులు ఆపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం విచారణ నిర్వహించాలని ఎంపీ పోలీసులను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.





చరణ్ శ్రీతేజ (పాత చిత్రం), విచారణ నిర్వహిస్తున్న ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సీఐ పెద్దిరాజు



సంఘటనా స్థలంలో మృతి చెందిన అనిల్

మినీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎటపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై గన్నవరం గ్రామ శివారులో సోమవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన గాదే అనిల్ (37) భద్రాచలంలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. ఫీల్డ్ వర్కులో భాగంగా ద్విచక్ర వాహనంపై కూనవరం వెళ్లి తిరిగి భద్రాచలం వెళ్తున్నాడు. భద్రాచలం వైపు నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో వస్తున్న మినీ లారీ బైక్‌ను ఢీకొట్టింది. అనిల్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. మినీ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



వీరాస్వామి (పాత చిత్రం)

కరప, అక్టోబరు 14: కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పిడుగు పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన నందికొండ వీరాస్వామి (35) భార్యతో కలిసి కాజులూరు మండలం ఉప్పుమిల్లిలో ఐదేళ్లుగా నివాసముంటున్నాడు. పశువులను మేపుకుంటూ, తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం వేకువజామున వర్షం పడుతుండడంతో పశువులను పాకలో కట్టేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ పిడుగుపాటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మరణించాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. వీరాస్వామి మృతితో స్థానికంగా విషాదం చోటుచేసుకుంది. స్థానిక వీఆర్వో ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరాస్వామి మృతితో జీవనాధారం కోల్పోయిన అతడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు, బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 14: తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన కైరా జయశ్రీ మరో ఐదుగురు విద్యార్థులు కొవ్వూరు జూనియర్ కళాశాలకు ఆటోలో బయల్దేరారు. గామన్ బ్రిడ్జి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గాయాలపాలైన వారిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు పట్టణ హెచ్‌సీ ఎం.సత్యనారాయణ తెలిపారు.



వేదమూర్తి, వీరబ్రహ్మం మృతదేహాలు

కోటిపల్లి గోదావరిలో గల్లంతైన యువకులు మృతి

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద ఆదివారం స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు యువకులు మృతి చెందారు. రామచంద్రపురం మండలం రావిచెరువుకు చెందిన నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని కోటిపల్లి వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేయడానికి గ్రామస్థులతో కలిసి వచ్చారు. నిమజ్జనం అనంతరం స్నానానికి దిగి గోదావరి లోతు తెలియక నీటిలో మునిగిపోయారు. స్థానికులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. రాత్రిదాకా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన సమీప ప్రాంతాల్లో సోమవారం వారు విగతజీవులుగా తేలారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ ఎస్‌కే జానీబాషా చెప్పారు.

పెళ్లి చేస్తానన్నారని మనస్థాపం

తల్లి ఒంటరి అవుతుందని పురుగుల మందు తాగిన యువతి

చికిత్స పొందుతూ పోస్ట్ ఉమన్ మృతి



సురేఖ (పాత చిత్రం)

ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసి నిన్ను అత్తవారింటికి పంపిస్తానని తల్లి చెప్పడంతో మనస్థాపానికి గురైన యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన సురేఖ (23) పేరవరంలో పోస్టు ఉమన్‌గా ఉద్యోగం చేస్తోంది. ఆమెకు తండ్రి లేరు. తల్లి వివాహం చేస్తానని చెప్పడంతో మనస్థాపానికి గురైంది. తనకు వివాహం చేస్తే అత్తవారింటికి వెళ్లిపోతానని, తల్లి ఒంటరిగా ఉంటుందని కలత చెందిన సురేఖ గత నెల 30వ తేదీన పేరవరం పోస్టాఫీసు వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు ఆమెను రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ పెద్దిరాజు తెలిపారు.

34 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్య అప్పారావు

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామ సమీపాన ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. తమిళనాడుకు చెందిన పుగాజ్‌హెంది (23) చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బు సంపాదించడానికి గంజాయిని మార్గంగా ఎంచుకున్నాడు. అక్రమంగా రవాణా చేస్తూ ఏలేరు కాలువ పరిధిలో పోలీసులకు పట్టుబడ్డాడు. 34 కిలోల గంజాయిని 16 ప్యాకెట్లు చేసి మోటారు సైకిలుపై తరలిస్తుండగా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని సీఐ చెప్పారు. పుగాజ్‌హెందిపై కేసు నమోదు చేశారు. సీఐ, ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



బోల్తా పడిన ఆటోలోంచి మహిళలను కాపాడి సపర్యలు చేస్తున్న దృశ్యం

ఆటో బోల్తా: ముగ్గురు మహిళలకు గాయాలు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో మాధవపట్నం వంతెన సమీపంలో 12 మందితో కాకినాడ వెళ్తున్న గోతిలో పడి అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవరు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అటుగా వెళ్తునన వారు ప్రయాణికులను రక్షించి చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలుపులమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పూజలు

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు సోమవారం విచ్చేశారు. ఆయనకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం రఘురామ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించగా ఈవో పి.విశ్వనాథరాజు మహా ప్రసాదం అందజేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు కావ్య

అప్పు తీర్చమంటే... వైసీపీ నాయకుడు దాడి చేశాడు

నాపై కేసు పెట్టమని మాజీ ఎంపీ భరత్ అనడం న్యాయమా: యాంకర్ కావ్యశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాపై వైసీపీ నాయకుడు ఎన్వీ శ్రీనివాస్ దాడి చేస్తే తిరిగి నాపైనే కేసుపెట్టమని మాజీ ఎంపీ భరత్‌రామ్ అనడం ఎంతవరకు న్యాయమని యాంకర్ కావ్యశ్రీ ప్రశ్నించారు. సోమవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో తెలుగు మహిళా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు శ్రీనివాస్ తనయుడు అభిలాష్‌కు తాను మూడేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చానని, అప్పట్నుంచీ 30 సార్లకు పైగా అడిగానన్నారు. ప్రతిసారీ వీడియో రికార్డింగ్ చేశానన్నారు. ఆ సొమ్మును తిరిగి అడిగినందుకు దాడి చేశారన్నారు. అప్పు విషయమై గతంలో ఎంపీ భరత్‌రామ్‌కు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు నాపై దాడి జరిగితే తిరిగి నాపైనే కేసుపెట్టమని అదే భరత్ చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని హోం మంత్రి అనితను కోరతామన్నారు. తెలుగు మహిళా నేతలు మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ మాట్లాడుతూ వైసీపీ నాయకులంతా ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో వుండి అహంతో వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలపై దాడులను కూటమి ప్రభుత్వం సహించదన్నారు. బాధిత మహిళకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు బోను ఈశ్వరి, శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య నేడు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు తమ స్వగ్రామాలకు వెళ్లి తిరిగి తమ గమ్యస్థానాలకు తిరిగివెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే అధికారులు మంగళవారం సికింద్రాబాద్-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నట్టు సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక సమాచారం జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 6.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరే ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇందులో ఒక ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీ, ఏసీ టూటైర్, త్రీటైర్, ఏసీ స్లీపర్, సెకండ్ క్లాస్, జనరల్ బోగీలు ఉంటాయి.



అధ్వానంగా తయారైన రోడ్ కం రైలు బ్రిడ్జి





ఇంత.. నిర్లక్ష్యమా!

- ఆసియాలోనే అతిపెద్ద రెండో రోడ్ కం రైలు బ్రిడ్జిపై అశ్రద్ధ
- నేటికీ అధ్వానం.. నిర్వహణ గాలికొదిలేసిన అధికారులు
- 50 ఏళ్లకే శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోరు ఏనాడు.. మరమ్మతులకు చూస్తే కోట్లు..







కొవ్వూరు, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి) : పేరు గొప్ప..ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. పేరుకేమో ఆసియాలోనే అతిపెద్ద రెండో బ్రిడ్జి.. ఆ బ్రిడ్జి మూతపడితే ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు నరకమే.. ఎందుకంటే రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా పశ్చిమగోదావరిలోకి వెళ్లాలన్నా.. పశ్చిమగోదావరి నుంచి రాజమహేంద్రవరం వైపు రావాలన్నా గగనమే.. అంత ప్రాముఖ్యత ఉన్నా నిర్వహణలో నిర్లక్ష్యం తాండవిస్తోంది.. ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కళ్లెదుటే శిథిలావస్థకు చేరుతోంది.ఇంతకీ ఏ బ్రిడ్జి అంటారా.. అదే కొవ్వూరు రాజమహేంద్రవరం కలిసే రోడ్డు కం రైలు బ్రిడ్జి దుస్థితి. 1974వ సంవత్సరంలో కేవలం రూ.16 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. అంటే ఇప్పటికి బ్రిడ్జి నిర్మించి 50 ఏళ్లవుతోంది. అంతటి ప్రాముఖ్యత కలిగిన వంతెనపై అడుగడుగునా అలసత్వం ప్రదర్శించడంతో తరచుగా మరమ్మత్తులకు గురవుతుంది. ఈ బ్రిడ్జికి మరమ్మతుల నిమిత్తం ఇప్పటికే పలు సార్లు మూసివేశారు. గత వైసీపీ ప్రభు త్వంలో అయితే ఏదో ఒక సాకుతో ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు మూసివేసిన ఘటనలు ఉన్నాయి. అయితే పనులు ఏమైనా చేశారా అంటే తూతూ మంత్రంగా ఉం డేవి. ఆ తరువాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందంటూ ఎక్స్‌ప్రెస్ బస్‌ల రాకపోకలను ఆపేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నా పట్టించుకున్నవారే లేరు. కూటమి ప్రభుత్వంలో అయినా తీరు మారిందా అంటే ఇప్పుడూ అంతే.. నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది. అఖండ గోదావరి నదిపై రాజమహేంద్రవరం, కొవ్వూరు పట్టణాలను కలుపుతూ నిర్మించిన రోడ్డు కం రైలు వంతెనపై నిర్వహణ సరిగా లేకపోవడంతో రోడ్డుకు ఇరుప్రక్కల మట్టి పేరుకు పోయింది. పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాలతో నిండిపోయింది.. రాజమహేంద్రవరం వైపు చూస్తే అధ్వానంగా ఉంది. దీంతో ఇటీవల వర్షాలకు వంతెనపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షపునీరు వంతెనపై ఎక్కడికక్కడ నిలిచి పోయి రోడ్డు తరచుగా మరమ్మత్తులకు గురవుతుంది. మరమ్మతుల నిమిత్తం కోట్లు ఖర్చు పెట్టే అధికారులు నిర్వహణలో మాత్రం శ్రద్ధ చూపడంలేదు. ఇకనైనా అధికారుల స్పందించి రోడ్డు కం రైలు బ్రిడ్జి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉభయ గోదావరి జిల్లాల ప్రజానీకం కోరుతున్నారు.

లక్కీ..ఛాన్స్!

(ఐదో పేజీ తరువాయి)

ఎక్సయిజ్ సిబ్బంది చెప్పినా చాలా మంది కదల్లేదు. లాటరీలో షాపు వచ్చి లాటరీకి రాని వారికి ఎక్సయిజ్ సిబ్బంది ఫోను చేసి సమాచారం అందించారు. రాజమహేంద్రవరానికి సంబంధించి సిండికేటుదారులు సుమారు 350 దరఖాస్తులు సమర్పించగా 16 షాపులు దక్కాయని చెబుతున్నారు. ఓ సిండికేటు 30 దరఖాస్తులు వేయగా ఒక్క షాపు దక్కింది. షాపుల కేటాయింపుల్లో సిండికేట్ల మాయాజాలం విజయం సాధించడంతో వారితో సంబంధం లేని వారికి దక్కిన షాపుల పరిస్థితిపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. సిండి కేటులో లేనివారికి ఒకవేళ కేటాయింపులో గెలిచినా అమ్మకాలు బాగా జరిగే చోట షాపు అద్దెకు తీసుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదనిపిస్తోంది. కచ్చితంగా సిండికేటు పాలసీకి తలొగ్గకపోతే వ్యాపారం చేయడం కష్టమని చెబుతున్నారు.

రండి బాబూ రండి..

మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిని ముందుగానే ప్రసన్నం చేసుకోడానికి ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు వాళ్లు ఆనం కళా కేంద్రం వద్ద ప్రత్యేకంగా కియోస్కులను ఏర్పాటు చేశారు. షాపునకు చెల్లించాల్సిన తొలి విడత ఫీజు నిమిత్తం కొందరు నగదు తీసుకొచ్చారు. వారికి అప్పటికప్పుడు కరెంట్ ఎకౌంటు ఓపెన్ చేసి డీడీ ఇచ్చారు. షాపులు దక్కించుకున్న వారి పేర్లను సేక రించి అకౌంటు ఓపెన్ చేయించే విధంగా ఫోను నెంబర్లు తీసుకున్నారు.

అదృష్టం లేదు : పి.వరలక్ష్మి, కొవ్వూరు

సిండికేటులో చేరలేదు. మేమే సొంతగా వ్యాపారం చేద్దామని తొలిసారిగా రూ.2లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లిం చాం. ఇంట్లో వాళ్లమే తలో కొద్దిగా డబ్బు పోగు చేసు కున్నాం. అదృష్టం వరించలేదని అనుకుంటున్నాం. షాపు దక్కలేదు.

పారదర్శకంగా నిర్వహించాం

లావణ్య, జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి



నూతన మద్యం పాలసీకి సంబంధించి షాపుల కేటాయింపునకు నిర్వహించిన లాటరీని అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. కలెక్టర్ ప్రశాంతి సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ లాటరీకి ఏర్పాట్లు చేశాం. ముందస్తుగా తగు కసరత్తు చేశాం. దీంతో ఎలాంటి విమర్శలకూ తావు లేకుండా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ప్రక్రియను వీడియోలో నిక్షిప్తం చేశాం.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):చాలాసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారానికి నోచుకోని సమస్యలతో ప్రజలు సతమతమౌతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా నగరంలో హైటెక్ బస్టాండ్ ఎదురుగా బిర్యాని పాయింట్ ఉందని, పదార్థాలు అక్కడే వండడం వల్ల పదార్థాలు మరుసటి రోజుకు దుర్వాసన వస్తున్నాయని, పక్కనే నివాసం ఉంటున్న తమకు చాలా ఇబ్బంది ఉందని, ప్రశ్నిస్తే తమపై తిరగబడుతున్నారని అండలూరి వీరవెంకట సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదన్నారు. ఈట్ స్ట్రీట్ నుంచి తొలగించిన తమ షాపులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని బాధితులు సత్య, మధుసూధన్ అర్జీ పెట్టుకున్నారు. కంబాలపేట ఎంపమార్కెట్‌లో తమకు కేటాయించిన నెం.7 షాపునకు ఒకేసారి పెద్ద ఎత్తున అద్దె పెంచడంతో ఇబ్బందులు పడుతున్నామని, అద్దెను తగ్గించాలని ఉప్పాడ రాంబాబు అర్జీ పెట్టుకున్నారు.

సీతానగరం: మండలంలోని చెరువుల ఆక్రమణలు తొలగించి చెరువుల పూర్వ స్థితి తీసుకురావాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు చిడిపి నకులసురేష్ ఫిర్యాదును ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌లకు అందజేశారు. ఉపగ్రహఛాయా చిత్రాలను జతచేశారు. మండలంలోని పురుషోత్తపట్నం, సీతానగరం, కూనవరం, రఘుదేవపురం, నాగంపల్లి, చినకొండేపూడి, గ్రామాల్లో చెరువులను పరిరక్షించాలని అర్జీ పెట్టుకున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం

- వైసీపీ పాలనలో అభివృద్ధి జాడలేదు
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ఘనంగా పల్లె పండుగ వారోత్సవాలు
- పలుచోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసాలే తప్ప అభివృద్ధి జాడలేదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పిడింగొయ్యి, హుకుంపేట, శాటిలైట్ సిటీ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే గోరంట్ల విచ్చేసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాజమహేంద్రవరం రూరల్ మండలంలో రూ.12.47 కోట్ల జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనుల చేపడుతున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో గ్రామ సభ లు నిర్వహించి ప్రజల అభిష్టం మేరకు సీసీ రోడ్లు, డ్రైన్లు తదితర పనులు చేపడుతున్నామన్నారు. ఒకే రోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం చారిత్రక విషయమన్నారు. కార్యక్రమంలో భాగంగా పిడింగొయ్యి గ్రామంలో రూ.3.30 కోట్లు, శాటిలైట్ సిటీలో రూ.1.50 కోట్లు, హుకుంపేటలో రూ.96 లక్షలతో పలు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవ రావు, దుద్దుపూడి రామకృష్ణ, మత్స్యేటి ప్రసాద్, బొప్పన అప్పారావు, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, కోరాడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పిడింగొయ్యిలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోరంట్ల

మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం

రాజానగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం, కలవచర్ల, నరేంద్రపురం, పాతవెలుగుబంద, కొత్త వెలుగుబంద గ్రామాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పర్యటించి, రూ.61 లక్షలతో పలు అభివృద్ధి పనులకు టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి తర్వాత పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టిందని, రూ.17.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గంగిశెట్టి చంటిబాబు, కంటే కేశవరావు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ వైవీవీ ఎస్ఎల్ఎస్ లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నరేంద్రపురంలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బత్తుల

త్వరలో ప్రధాన రహదారులకు మరమ్మతులు

అనపర్తి/బిక్కవోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరా రామచంద్రపురంలో రూ.10.50 లక్షలు, దుప్పలపూడిలో రూ.50.30 లక్షలు, లక్ష్మీనరసాపురంలో రూ.80.50 లక్షలు, అనపర్తిలో రూ.13లక్ష లతో నిర్మించనున్న 24 సీసీ రోడ్డులకు, బిక్కవోలు మండలం కొంకుదురులో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్ర ధాన రహదారుల మరమ్మతులు కూడా త్వరలో ప్రారంభిస్తా మని, వర్షాలు తగ్గిన వెంటనే కాకినాడ-రాజమండ్రి కెనాల్ రోడ్డు పనులు చేపడతామన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిందని, సీఎం చంద్రబాబు పరిస్థితులను చక్కదిద్దుతున్నారన్నారు. కొంకుదురు హైస్కూల్లో గ్రీన్‌బోర్డులను, విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలం పూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు తేతల సుధాకరరెడ్డి, వారా కుమారి, కర్రి బులిరెడ్డి పాల్గొన్నారు.



కొంకుదురులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పేదల సంక్షేమమే లక్ష్యం

గోకవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామరాజుపేట, కొత్తపల్లి, గోకవరం, కృష్ణునిపాలెం, మల్లవరం గ్రామాల్లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పర్యటించి సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చామని, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



పనులకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

భర్తపై వేధింపుల కేసు

సీతానగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన వ్యక్తిపై పోలీసులు సోమవారంవేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్ఐ రామ్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పనమాల చిన్నబాబుకు, విజయవాడకు చెందిన లక్ష్మీదుర్గకు రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కొద్దికాలంగా లక్ష్మీదుర్గను భర్త వేధింపులకు గురిచేస్తున్నాడు. మహిళా మండలి సమక్షంలో పెట్టినా అతడి తీరు మారకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కాటవరం గ్రామానికి చెందిన మేకల వెంకటరావు అనే వృద్ధుడు స్థానికంగా వాటర్ ప్లాంట్ వద్ద నిలబడి ఉండగా రాజహేంద్రవరం నుంచి సీతానగరం వైపు వెళుతున్న కారు డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంగా వచ్చి ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నాగేశ్వరరావుకు పౌర సన్మానం

కోరుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు మెట్ట గ్రామాలకు సాగు, తాగు నీరు అందించడంలో చేసిన కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి పేర్కొన్నారు. విశిష్ట సేవాపురస్కారం అందుకున్న సందర్భంగా నాగేశ్వరరావుకు స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో పౌర సన్మానం జరిగింది. ఆయనను కూటమి నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరి, గంగిశెట్టి సత్తిబాబు, బదిరెడ్డి దొర, అడపా వీరబాబు, అడ్డాల శ్రీనివాసు, బత్తుల వెంకటలక్ష్మి, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

కోరుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో నిర్మిస్తున్న శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి జనసేన పార్టీ మండల గౌరవాధ్యక్షుడు బదిరెడ్డి సత్యనారాయణమూర్తి దొర కుటుంబ సభ్యులు రూ.5లక్షల విరాళాన్ని తనకాల నాగేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. దీనిలో రూ.4 లక్షలు ఆలయ నిర్మాణానికి, రూ.50 వేలు వడ్డీల రామాలయ నిర్మాణానికి, మరో రూ.50 వేలు వాడీల పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి అందజేసినట్టు దొర పేర్కొన్నారు. కార్యక్రమంలో కటకం సత్యనారాయణ, కోలా వీరేష్‌కుమార్, కటకం చలం, కర్రి వీరగణేష్, సుంకర శ్రీను, పసుపులేటి శివ, అడపా వీరబాబు పాల్గొన్నారు.

పందలపాక ఉపసర్పంచ్ వెంకటరామారెడ్డి పుట్టినరోజు

బిక్కవోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయనతో కేకు కట్ చేయించి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పడాల రామారెడ్డి, కూటమి నాయకులు అనుసూరి నాగేశ్వరరావు, కర్రి పైడారావు, పడాల సూర్యనారాయణరెడ్డి, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

పార్కులో సౌకర్యాలు మెరుగుపర్చాలి



ఏబీ నాగేశ్వరరావు పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురంలోని ఏబి నాగేశ్వరరావు పార్కులో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పార్కును ఆయన పరిశీలించారు. పార్కు చెరువులోని గుర్రపుడెక్కను వెంటనే తీయించాలని, పార్కు చుట్టూ అవసరమైన చోట్ల హైమాక్స్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, నిత్యం పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టాలని పిచ్చి మొక్కలు తొలగించాలని పేర్కొన్నారు. మంచినీటి కుళాయి వేయించాలని, రాత్రివేళలో పోలీస్ గస్తీ పెట్టాలని అధికారులను ఆదేశించారు. పార్కును శుభ్రంగా స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబా సమాధి మహోత్సవాలు

కోరుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి సాయిబాబా ఆలయంలో బాబా సమాధి మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయిరాం విద్యాసంస్థ విద్యార్థులు సీతారాముల కల్యాణాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగ కేశవరావు, మామిడిపల్లి రామారావు, బీవీవీఎస్ నారాయణ, కంటే గణపతి పాల్గొన్నారు. కోరుకొండ ద్వారకా సాయినగర్ సాయి బాబా ఆలయం వద్ద సత్యవ్రతాలు, సహస్ర గులాబి అర్చన, పంచామృత అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. లలిత, విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. సహస్ర దీపోత్సవం, సద్గురు దత్త చాలీసా పారాయణం జరిగింది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాడి ఆదిరెడ్డి, అల్లు జయశ్రీ, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ పాల్గొన్నారు.

దుర్గాదేవికి బంగారు హారం బహూకరణ

రాజానగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలోని చక్రద్వారబంధం దేవిచౌక్‌లో కొలువుదీరిన అమ్మవారికి స్థానిక భక్తులు ప్రగడ రమణ, సూరిబాబు రెండు కాసుల బంగారు నెక్లెస్‌ను బహూకరించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పణ, తీర్థం జరుగుతుందని,భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని ఉత్సవ కమిటీ సూచించారు.

నిత్యావసరాల ధరలు అదుపు చేయాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాలు, కూరగాయల ధరలను అదుపు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నూనెలు, పప్పులు, కిరాణా, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉల్లిపాయలు, టమోటా, వెల్లుల్లి వంటివి నల్లబజార్లకు చేరడంతో వ్యాపారుల మాయాజాలంతో ధరలు దారుణంగా పెరిగిపోయాయన్నారు. తక్షణమే ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన మండల మహిళా కమిటీ ఎంపిక

కోరుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల మహిళా కమిటీని నియమించారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కమిటీ వివరాలు మీడియాకు వివరించారు. మండల గౌరవ అధ్యక్షురాలిగా కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, అధ్యక్షురాలిగా వాసిరెడ్డి మంగతాయారు, ఉపాధ్యక్షులుగా ముక్కాదేవి దుర్గ(కణుపూరు), సేనపతి బంగారుపాప(గాదరాడ), గుండుపల్లి వీరగంగ(బుచ్చింపేట), పొట్నూరి అచ్చియమ్మ(కోటికేశవరం), జల్లు ఉషాలావణ్య(కోరుకొండ)లను నియమించారు. ఈ సందర్భంగా జనసేన మండల మహిళా కమిటీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇచ్చిన బాధ్యతలు విజయవంతం నెరవేరుస్తామని పేర్కొన్నారు.

19 నుంచి రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలు

దివాన్‌చెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి జరుగుతాయని జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో రెండు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులకు ఆ పాఠశాలలోనే వసతిసౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అండర్-14, 17, 19 విభాగాల్లోని దాదాపు 450మంది బాలబాలికలు హాజరవుతారని స్వామి తెలిపారు.

క్షతగాత్రుడికి న్యాయం చేయాలి

గోకవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మైనింగ్ శాఖలో ఎంఆర్ మైనింగ్ సీనరీస్ కాంట్రాక్ట్ సంస్థలో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్తికేయకు న్యాయం చేయాలంటూ సోమవారం గోకవరంలో దళిత నాయకుడు వరసాల ప్రసాద్ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తికేయ మే నెలలో విధులు నిర్వర్తించి తిరిగి వస్తుండగా బూరుగుపూడి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. అప్పటి నుంచి మైనింగ్ నిర్వాహకులు పట్టించుకోలేదని ఆరోపించారు. క్షతగా త్రుడికి న్యాయం జరిగే వరకు ఊరుకోబోమన్నారు. విశ్వహిందూ ధర్మ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో దళితుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము

రి.క.నెం.91/2024 తేది. 14-10-2024

టెండరు ప్రకటన

అనపర్తి మండలం, అనపర్తి గ్రామ పంచాయతీకి 2024-2025వ ఆర్థిక సంవత్సర మునకు ఈ దిగువతెలియజేసిన షెడ్యూలు దాఖలా సేవలు (గ్రామపంచాయతీకి కావలసిన వస్తువులు విడి పరికరములు సప్లై చేయుటకుగాను ది.01-10-2024 నుండి31-03-2025 సంవత్సరము వరకు అమలులో ఉండు పద్ధతిపై సీలు చేసిన టెండర్లను పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వేరొకరితో గాని ది.16-10-2024 బుధవారం ఉదయం గం.11.00ల నుండి మధ్యాహ్నం గం.1.30.ని.ల వరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు ఆ రోజు మధ్యాహ్నం గం.3.30 ని.లకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షములో తెరువబడును టెండరు షరతులు మిలిగిన వివరములు కార్యాలయము పని వేళల యందు అడిగి తెలుసుకొనవలెను. టెండర్లు దాఖలు చేయువారు. షెడ్యూలు దాఖలా టెండరు డిపాజిట్ చెల్లించి రశీదు జతపర్చి టెండరు దాఖలుచేయవలెను డిపాజిట్ చెల్లించని టెండర్లు పరిగణలోకి తీసుకొనబడవు.

వ.నెం.	షెడ్యూలు	ధరావత్తు
A	ప్రజారోగ్య-పారిశుధ్య విభాగము	
1.	సున్నం, బ్లీచింగ్, ఫినాయిల్, ఎం.ఎల్ అయిల్ మరియు ప్రభుత్వం వారు సూచించిన మందులు సప్లై చేయుటకు	1000
2	వీధులను శుభ్రపరచుటకు కావాలసిన పరికరములు, గిన్నెలు, చీపుళు డ్రైన్ పారలు, ఇనుప దొండులు, పారలు, కొడవళ్ళు, గొర్రుళ్ళు, గునపములు మొదలగునవి	500
3	ట్రాక్టరు ఇంజన్లు, టక్కు రిపేర్లు చేయుట	500
B	మంచినీటి సరఫరా - నిర్వహణ విభాగము	
1	మంచినీటి సరఫరా నిమిత్తం కావలసిన అన్ని రకముల సామాన్లు మరియు చేతిపంపు సామాన్లు విడిపరికరములు సప్లై, మోటార్లుకు అవసరమైన స్విచ్‌లు కేబుల్ వైరు, పానల్ బోర్డు సామాన్లు కలిపి సప్లై	
2	సబ్ మెర్సిబుల్ మోటార్ల రిపేరు బోరు నుండి మోటారు తీయుట, రిపేరు చేసి తిరిగి దింపుటకలిపి మొత్తం నిర్వహణ ఖర్చులు	500
C	విద్యుత్ దీపములు-విడి పరికరములు	
1	గ్రామపంచాయతీకి కావలసిన వీధి విద్యుత్ దీపములు, సప్లై ఎలక్ట్రికల్ సామాన్లు అన్ని రకముల విడివిభాగములు-నాణ్యత, సంస్థ వారి ధృవీకరణ ఉన్న సంస్థ శ్రీ జిల్లా కలెక్టరు వారి ఆమోదిత రేట్లకు లోబడి సప్లై చేయుటకు	500

అనపర్తి
14-10-2024

టి.శ్రీనివాసరావు
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ అనపర్తి

శ్రీమతి వారా కుమారి
సర్పంచ్
గ్రామ పంచాయతీ అనపర్తి



ఇంత నిర్లక్ష్యమా!

ఈ చిత్రం ఎక్కడిదో గుర్తుపట్టారా! ఇలా ఉంటే ఏం తెలుస్తుంది లెండి.. అయితే ఎక్కడిదో తెలిస్తే మాత్రం అవాక్కవడం మీవంతవుతుంది.. ఎందుకంటే ఇది ఆషామాషీ వంతెన కాదండోయ్.. ఆసియాలోనే అతిపెద్ద రెండో రోడ్ కం రైలు బ్రిడ్జిపై దుస్థితి.. ఈ ఒక్క చిత్రం చాలు కొవ్వూరు- రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై నిర్మించిన వంతెన ఎంత అధ్వానంగా ఉందో చెప్పడానికి.. ప్రస్తుతం వంతెన చూస్తే డంపింగ్‌యార్డ్‌లా ఉంది.. ఎందుకంటే వంతెనపై ఎటు చూసినా చెత్త..మరో వైపు పిచ్చిమొక్కలు.. ఇంకో వైపు పాడైన ఫుట్‌పాత్.. చాలా కాలంగా సాగుతున్న రెయిలింగ్ పనులు.. ప్రతి రోజూ ఆ బ్రిడ్జిపై అటూ ఇటూ అధికారులు తిరుగుతూనే ఉంటారు.. అయినా కనీస చర్యలు శూన్యం.. అయ్యా అధికారులు ఇకనైనా కళ్లు తెరవండి.. - వివరాలు 8లో

ఫస్టియర్ మెడికోలకు హాస్టల్ సౌకర్యం

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రవేశాలు పొందిన ఫస్టియర్ విద్యార్థులకు మెడికల్ కాలేజీ అధికారులు హాస్టల్ సౌకర్యం వసతి కల్పించారు. మెడికోలకు వసతెలా అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గతేడాది ఫస్టియర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన నాలుగు తాత్కాలిక హాస్టళ్లను కొత్తగా చేరిన వారికి కేటాయించారు. దీంతో ఫస్టియర్‌లో చేరిన మెడికోలు కేటాయించిన హాస్టళ్లలోకి చేరుకున్నారు. ఈ ఏడాది ఫస్టియర్‌లో 140 మంది వరకూ ప్రవేశాలు పొందగా సోమవారం సుమారు 50 మంది వరకూ హాస్టల్స్‌లో వసతి తీసుకున్నారు. మిగిలిన వాళ్లు ఒకట్రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ తాత్కాలిక హాస్టళ్లలో ఉంటూ సెకండియర్‌లోకి వెళ్లిన మెడికోలను కొత్త భవనాల్లోకి షిఫ్ట్ చేశారు. అక్కడ ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నా ఫస్టియర్ విద్యార్థులు రావడంతో సెకండియర్ విద్యార్థులను కొత్త హాస్టల్ భవనాల్లోకి షిఫ్ట్ చేయడం తప్పనిసరిగా మారింది. జీజీహెచ్ ఆవరణలో మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం బాలురు, బాలికలకు వేర్వేరుగా రెండు కొత్త హాస్టల్ భవనాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

ఫస్టియర్ క్లాసులు ఆరంభం

ఫస్టియర్‌లో చేరిన మెడికోలకు సోమవారం నుంచి క్లాసులు ప్రారంభించారు. ముందుగా ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి ఇంట్రడక్షన్ క్లాసు తీసుకున్నారు. నిబంధనలు, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ వివరించారు. విద్యార్థుల సమాచారం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలేమైనా ఉంటే తనకు చెప్పాలని సూచించారు.హాస్టళ్ల భవన నిర్మాణ పనులు చాలా వరకూ పూర్తయ్యాయని, చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయని, వీటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరడం జరిగిందని సౌభాగ్యలక్ష్మి తెలిపారు.

ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం.. విద్యార్థులకు ప్రాణ సంకటం





ఆటో బోల్తా.. ఆరుగురు విద్యార్థినులకు గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తోంది..గతంలో వైజాగ్‌లో విద్యార్థుల ఆటో ప్రమాదం జరిగిన ఘటనతో అందరూ ఉలిక్కి పడ్డారు.. అధికారులు ముమ్మర తనిఖీలు చేశారు. ఆ తరువాత చూస్తే షరామామూలే.దీంతో ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యం వాహనాలు నడుపుతూ ప్రమాదా లకు గురవుతున్నారు.కొవ్వూరులో సోమవారం జరిగిన ఘటనే అందుకు నిదర్శనం.కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామం నుంచి సోమవారం కైరా జయశ్రీ మరో ఐదుగురు విద్యార్థినులు సోమవారం కొవ్వూరు జూనియర్ కళాశాలకు బయలుదేరారు.గామన్ బ్రిడ్జి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యార్థినులు గాయాలపాలయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది విద్యార్థినులను హైవే పెట్రోలింగ్ వాహనంలో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఉన్నతాధికారులు పాఠశాలలకు పరిమితికి మించి విద్యార్థినులను తీసుకెళుతున్న ఆటోలపై దృష్టి సారించాల్సి ఉంది.

భవానీలకు త్రుటిలో తప్పిన ప్రమాదం



నల్లజర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): త్రుటిలో ప్రమాదం తప్పింది.. దీంతో భవానీ మాలధారులు ఊపిరిపీల్చుకున్నారు. విజయదశమి ఉత్సవాల్లో భాగంగా విశాఖపట్నానికి చెందిన 27 మంది భవానీ మాలధరించారు.విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని మాల తీసివేయడానికి సోమవారం రాత్రి ఒక ప్రైవేటు బస్సులో భవానీలు బయలుదేరారు. అయితే అతివేగం కారణంగా సోమవారం తెల్లవారుజామున అనంతపల్లి శివారులో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుభాగం ధ్వంసమైంది. బస్సులోని భవానీలకు ఎలాంటి గాయాలు కాలేదు. కనకదుర్గమ్మ తమను కాపాడిందని భవానీ భక్తు లు అన్నారు. అందరూ సురక్షితంగా బయటపడడంతో కాపాడిన కనకదుర్గమ్మ దర్శించు కునేందుకు వేరే బస్సులో విజయవాడ బయలుదేరి వెళ్లారు.



ఆనం కళాకేంద్రం వద్ద బయట కూర్చున్న దరఖాస్తుదారులు

డ్రా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

లక్కీక్వాయిన్ చూపుతున్న ఎక్సైజ్ అధికారి

లక్కీ ఛాన్స్!

125 షాపులు కేటాయింపు

- ప్రశాంతంగా మద్యం లాటరీ
- 9:30 గంటల పాటు నిర్వహణ
- లాటరీ మొత్తం వీడియో
- 16 మంది మహిళలకు షాపులు
- సిండికేటుదారుల మాయాజాలం
- ఆనం కళాకేంద్రం వద్ద సందడి
- లోన్లకు బ్యాంకుల క్యూ

రాజమహేంద్రవరం,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొందరికి లక్ కిక్ తగిలింది.. మరికొందరికి లక్ లేక నీరసం ఆవహించింది. నూతన మద్యం పాలసీ 2024-26కి సంబంధించి రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో సోమవారం లాటరీ ద్వారా నిర్వహించిన షాపుల కేటాయింపు ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో జేసీ చిన్న రాముడు, జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి లావణ్య స్వీయ పర్యవేక్షణలో 9.30 గంటల పాటు లాటరీ నిర్వహించారు. షాపు దక్కించుకున్న వారి నుంచి తొలి విడత ఫీజు జమ చేయించుకొని ప్రొవిజనల్ లైసెన్సు జారీ చేశారు. బుధవారం(రేపు) నుంచి ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి రానున్నాయి. సరుకు ఇప్పటికే డిపోలకు చేరుకొంది. జిల్లాలో 125 మద్యం షాపులకు 4384 దరఖాస్తులు అందిన విషయం తెలిసిందే. మద్యం షాపుల విషయంలో అధికార, ప్రతిపక్ష నేతలు ఒకే తాటిపైకి వచ్చి కలిసి మెలిసి 'పని' చేసు కుపోవడంతో కిక్కు అవాక్కయ్యింది.

ఉదయం 8 గంటల నుంచే..

లాటరీ ఉదయం 8గంటల నుంచి ప్రారంభించారు. ఓ గంట ముందుగానే దరఖాస్తుదారులు ఆనం కళా కేంద్రం వద్దకు చేరుకున్నారు. అప్పటికే బయట ఏర్పాటు చేసిన టెంట్లలో వేచి చూశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో మొదలు పెట్టి నిడదవోలు మునిసిపాలిటీతో సాయంత్రం 5.30 గంటల సమయానికి లాటరీ ముగించారు. ఎవరి వంతు వచ్చినప్పుడు వారిని లోపలకు పిలిచారు.లాటరీ టోకెన్లను ఆయా ఏరియా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో తీయిం చారు. లాటరీ ప్రక్రియను వీడియో తీయించారు. వేదిక వద్ద రెండు స్క్రీన్లు ఏర్పాటు చేసి టోకెన్లను ఉంచిన అట్టను చూపించి దరఖాస్తుదారులు ఓకే అన్న తర్వాతే ఆ టోకెన్లను ప్రత్యేకంగా తయారు చేయించిన డబ్బాలో వేసి అటూ ఇటూ మూడు సార్లు తిప్పి సంబంధిత ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓ టోకెన్ తీసి ప్రకటించారు. వెం టనే రిజర్వు 1, రిజర్వు 2 టోకెన్లను తీసి నెంబర్లు, పేర్లను ప్రకటించారు. ఒకవేళ లాటరీలో విజయం సాధించిన వారు నిర్ణీత సమయంలో ఫీజు చెల్లించకపోయినా, ఇతర నిబంధనలు ఉల్లంఘించినా తదరుపరి విజేతలుగా ఆర్ 1, వారూ విఫలమైతే తర్వాత ఆర్ 2ని పరిగణలోకి తీసుకుంటారు.



లక్ తగిలిందా : ఆనం కళాకేంద్రం వద్ద మహిళలు

మద్యం మహాలక్ష్ములు..

మద్యం షాపులకు దరఖాస్తులను కొందరు సెంటిమెంటుగా భావించి మహిళల పేరుతో సమర్పించారు. మద్యం లాటరీ ప్రాంగణంలో స్వల్పంగా మహిళ సంఖ్య కనిపించింది. రాజమహేంద్రవరం అర్బన్‌లో షాపు నెం.2 గుత్తుల సుబ్బలక్ష్మి, షాపునెం- మేకా ప్రభావతి, 27-టేకుమూడి ధనలక్ష్మి, బిక్కవోలు 35-తాళ్ల సత్యమౌనిక, దేవరపల్లి 48-ఈడుపుగంటి ఇంద్రాణి, కోరుకొండ 63-బొరుసు వీర నాగ వరలక్ష్మీస్వరూప, 65-సంపతి నాగలక్ష్మి, రాజమహేంద్రవరం రూరల్ 88-నిమ్మగడ్డ త్రివేణి, 91-బోళ్ల మౌనిక, 94- అంగర అరుణకుమారి, 97-నరేశ్ పద్మావతి, రాజానగరం 101 - కె.శరణ్య, సీతానగరం 108 - ఇళ్ల లక్ష్మి, తాళ్లపూడి 113 - చేబోలు రామకుమారి, కొవ్వూరు 121-కొప్పుల సృజన, నిడదవోలు షాపు నెం.125 బొల్లం శివ పార్వతి పేరుతో షాపులు దక్కాయి. జిల్లాలోనే అత్యధికంగా గోపాలపురం మండలంలోని షాపు నెం.54కి 68, దేవరపల్లి మండలంలోని షాపు నెం.45కి 66 దరఖాస్తులు అందాయి. వీటికి సంబంధించి వరుసగా ఆలపాటి అరుణ్‌కుమార్, పేరిచర్ల సత్యనారాయణ రాజును విజయం వరించింది.

సిండి'కేటు'

మద్యం షాపులను అధికంగా సిండికేట్లు దక్కించుకోవడం బహిరంగ రహస్యంగా వినవచ్చింది. మద్యం షాపులకు అధికార ప్రతిపక్ష పార్టీల నాయకుల ఒక్కటైపోయినట్లు కనిపించింది. దీంతో సిండికేట్లలో ఇరు పక్షాల వాళ్లు ఉండడం గమనార్హం. ఆనం కళా కేంద్రం లోపల సాయంత్రం వరకూ రద్దీగానే ఉంది. షాపులు దక్కని వారు బయటకు వెళ్లాలని (మిగతా 8వ పేజీలో)

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ హెచ్చరికలపై కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్,భారీ వర్షాల నేపథ్యంలో రానున్న నాలుగైదురోజుల పాటు అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర క్షేత్రస్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకా శం ఉందని, అధికారులు విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని జాగ్రత్త వహించా లన్నారు. జిల్లాలో వరి కోతల వల్ల 2,555 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, అది ఓపెన్ మార్కెట్‌కు వెళ్లిందా లేదా అనేది నిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. దాన్యం వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. గన్నీ బ్యాగ్స్ కేటాయింపు, వాహనాల ఏర్పాటు, హమాలీలు, ఆర్‌ఎస్‌కెలలో మౌలిక వసతులపై దృష్టి సారించాలని సూచించారు.

వర్షాలు ఉంటే.. వరి కోతలు వద్దు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు సోమవారం పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట కోతకు సమాయత్తంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 418 హెక్టార్లలో కోతలు జరిగినట్టు తెలిపారు. ఓపెన్ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నప్పటికీ గిట్టుబాటు ధర ఉండేలా చూసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని వర్షాలకు తడవకుండా సురక్షితమైన ప్రదేశాల్లో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో వరి కోతలు పూర్తిగా నిలుపుదల చేయాలన్నారు. పొలంలో నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికంగా వర్షాలు పడి తగ్గిన వెంటనే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులపై పడేవిధంగా పిచికారీ చేసి పక్వానికి వచ్చిన పంట సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీదారుడి సమస్య వింటున్న డీఆర్‌వో నరసింహులు

పీజీఆర్ఎస్‌కు 120 అర్జీలు

సత్వరం పరిష్కరించాలని డీఆర్‌వో ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ , అక్టోబరు 14: రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఆర్‌వో నరసింహులు అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 120 అర్జీలు ప్రజల నుంచి వచ్చినట్టు తెలిపారు.రెవెన్యూ శాఖ 47, వ్యవసాయ శాఖ 22, పోలీస్ శాఖ 15, పంచాయితీ రాజ్ 9, ఇతర శాఖలకు సంబంధించి 27 అర్జీలు స్వీకరించారు. పేపరుమిల్లు మాజీ ఉద్యోగి వి.శివరామకృష్ణ తదితరులు డిపాజిట్ చేసిన మొత్తాలకు సంబంధించి వడ్డీని పేపరుమిల్లు యాజమాన్యం చెల్లించడంలేదని యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని అర్జీపెట్టుకున్నారు. సంబంధిత అధికారులు కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు.


పోలీస్ గ్రీవెన్స్‌కి 15 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్(మీ కోసం)లో ఎస్పీ నరసింహ కిషోర్ 15 అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.చట్ట పరిధిలో సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు.



కుంతీదేవి ఊరేగింపు

ఉండ్రాజవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల్లో భక్తులు అధికం.. అందుకే అందరు దేవతల ప్రతిష్టిస్తారు.. పూజిస్తారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో పాండవుల తల్లి పాండురాజ్యు భార్య కుంతీదేవి ఆలయం ఉంది. ప్రతి ఏడాది దసరాలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది దసరా 9 రోజులు ఉత్సవాలు నిర్వహించారు.ప్రత్యేకంగా అలంకరించిన అంబారీ వాహనంపై సోమవారం అమ్మవారి విగ్రహం ఉంచి ఊరేగించారు. బ్యాండుమేళా, బాణాసంచాతో ఊరేగింపు ఘనంగా సాగింది. సర్పంచ్ మెండే లలితకుమారి, కమిటీ సభ్యులు జాతరను పర్యవేక్షించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అప్పు తీర్చమంటే.. వైసీపీ నాయకుడి దాడి

ఈవెంట్ యాంకర్ కావ్య

19 నుంచి రైఫిల్ షూటింగ్ పోటీలు

8

పల్లెకు పండగొచ్చింది!

- 20వ తేదీ వరకూ పల్లె పండుగ
- 253 గ్రామాల్లో నిర్వహణ
- గ్రామ సభలో పనులకే ప్రాధాన్యం
- 999 పనులకు రూ.96.71 కోట్లు
- రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- సంక్రాంతికి పూర్తయ్యేలా చర్యలు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పల్లెల్లో కూటమి పండగ ఆరంభమైంది. ఐదేళ్ల తర్వాత పల్లెలకు సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి పల్లె పండుగ వారోత్సవాలకు సోమవారం జిల్లాలో శ్రీకారం చుట్టారు. ఈ నెల 20వ తేదీ వరకూ 253 గ్రామాల్లో సమస్యలు పరిష్క రిస్తారు. జిల్లాలో ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామ సభల్లో గుర్తించిన పనులకు ప్రాధాన్యత ఇస్తారు. సం క్రాంతి నాటికి ఆయా పనులను పూర్తి చేసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి రూ.96.71 కోట్లతో 999 పనులకు పరిపాలనాపరమైన ఆమోదం లభించింది. పంచాయతీ రాజ్ ద్వారా 698 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 301 సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలసి నిడదవోలు మండలం రావిమెట్లలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో మొత్తం 9 రోడ్లకు శంకుస్థాపన చేశారు.రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో మూడు చోట్ల ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పల్లె పండుగ నిర్వహించారు. పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ, హుకుంపేటలో పలు రోడ్ల పనులకు ఆయన భూమి పూజ చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతారాంపురం, నరేంద్రపురం, వెలుగుబంద, రామస్వామిపేట, రాజానగరం, సూర్యారావుపేట, చక్రద్వారబంధంలో పల్లె పండగ వారోత్సవాలు ప్రారంభించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బిక్కవోలు మండలం కొంకుదురు, మెళ్లూరు, ఆరికిరేవుల, అనపర్తి మండలంలోని పేరా రామచంద్రపురం, దుప్పలపూడి, లక్ష్మీనరసాపురం,అనపర్తి గ్రామాల్లో పల్లె పండగ పనులకు శంకుస్థాపన చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ద్వారకా తిరుమల మండలంలో పల్లెపండుగను ప్రారంభించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తాళ్లపూడి మండలంలో పల్లెపండగ పనులకు శంకుస్థాపన చేశారు.

గ్రామాల్లో పనులను తనిఖీ చేస్తా : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో చేపట్టిన పనులను సంబం ధించి గోడలపై పెయింటింగ్ వేయించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు.పల్లె పండుగ కార్యక్రమంలో మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలన్నారు. జిల్లాలో కొత్తగా జాయిన్ అయిన ఎంపీడీవోలు రిపోర్టు చేసిన తరువాత మాత్రమే విధులు నిర్వహించాలని ఆదేశించారు.లేదంటే ఇప్పటి వరకు విధులకు హాజరుకానట్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనుల వివరాలు ప్రజలకు తెలిసేవిధంగా ప్రదర్శించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు పాల్గొనేలా చూడాలన్నారు.పల్లె పండుగ కార్యక్రమాలకు గ్రామీణాభివృద్ధి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మండలంలో సమస్య ఉన్న శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలన్నారు. అక్టోబరు 16 నుంచి ఓపెన్ ఇసుక రీచ్‌లు ప్రారంభం కానున్న దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తరువాత మాత్రమే తవ్వకాలు చేపట్టాలన్నారు.సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, సీపీవో ఎల్.అప్పలకొండ,వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీపీవో బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ అలీముల్లా, హార్టికల్చర్ అధికారి సుజాత కుమారి పాల్గొన్నారు.





పల్లె పండుగలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, టీడీపీ నాయకులకు సముదాయింపు

పల్లెలన్నీ అభివృద్ధి చేస్తాం : దుర్గేష్

నిడదవోలు,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.నిడదవోలు మండలం శింగవరం, కంసాలిపాలెం, రావిమెట్ల, తిమ్మరాజుపాలెం, సూరాపురం, కాటకూటేశ్వరం, ఉనకరమిల్లి, తాడిమళ్ల, కోరుమామిడి గ్రామాల్లో సుమారు రూ.3 కోట్ల విలువైన సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.20వ తేదీ వరకు వారం రోజుల పాటు పల్లెపండుగ వారోత్సవాలు జరుగుతాయన్నారు. గత వైసీపీ ప్రభు త్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచు కోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పల్లెల అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

మంత్రి దుర్గేష్‌తో టీడీపీ నేతల వాగ్వాదం

తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని కనీసం సమా చారం కూడా ఉండడం లేదంటూ మంత్రి దుర్గేష్‌ను కంసాలిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి తమకు సరైన సమాచారం ఉండడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఆహర్నిశలు శ్రమించినా కనీస గుర్తింపు లేదన్నారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంత్రి దుర్గేష్ టీడీపీ నాయకులకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.



అధ్వానంగా తయారైన రోడ్ కం రైలు బ్రిడ్జి





ఇంత.. నిర్లక్ష్యమా!

- ఆసియాలోనే అతిపెద్ద రెండో రోడ్ కం రైలు బ్రిడ్జిపై అశ్రద్ధ
- నేటికీ అధ్వానం.. నిర్వహణ గాలికొదిలేసిన అధికారులు
- 50 ఏళ్లకే శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోరు ఏనాడు.. మరమ్మతులకు చూస్తే కోట్లు..





కొవ్వూరు, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి) : పేరు గొప్ప..ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. పేరుకేమో ఆసియాలోనే అతిపెద్ద రెండో బ్రిడ్జి.. ఆ బ్రిడ్జి మూతపడితే ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు నరకమే.. ఎందుకంటే రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా పశ్చిమగోదావరిలోకి వెళ్లాలన్నా.. పశ్చిమగోదావరి నుంచి రాజమహేంద్రవరం వైపు రావాలన్నా గగనమే.. అంత ప్రాముఖ్యత ఉన్నా నిర్వహణలో నిర్లక్ష్యం తాండవి స్తోంది.. ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కళ్లెదుటే శిథిలావస్థకు చేరుతోంది.ఇంతకీ ఏ బ్రిడ్జి అంటారా.. అదే కొవ్వూరు రాజమహేంద్రవరం కలిసే రోడ్డు కం రైలు బ్రిడ్జి దుస్థితి. 1974వ సంవత్సరంలో కేవలం రూ.16 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. అంటే ఇప్పటికి బ్రిడ్జి నిర్మించి 50 ఏళ్లవుతోంది. అంతటి ప్రాముఖ్యత కలిగిన వంతెనపై అడుగ డుగునా అలసత్వం ప్రదర్శించడంతో తరచుగా మరమ్మత్తులకు గురవుతుంది. ఈ బ్రిడ్జికి మరమ్మతుల నిమిత్తం ఇప్పటికే పలు సార్లు మూసివేశారు. గత వైసీపీ ప్రభు త్వంలో అయితే ఏదో ఒక సాకుతో ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు మూసివేసిన ఘటనలు ఉన్నాయి. అయితే పనులు ఏమైనా చేశారా అంటే తూతూ మంత్రంగా ఉం డేవి. ఆ తరువాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందంటూ ఎక్స్‌ప్రెస్ బస్‌ల రాకపోకలను ఆపేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నా పట్టించుకున్నవారే లేరు. కూటమి ప్రభుత్వంలో అయినా తీరు మారిందా అంటే ఇప్పుడూ అంతే.. నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది. అఖండ గోదావరి నదిపై రాజమహేంద్రవరం, కొవ్వూరు పట్టణాలను కలుపుతూ నిర్మించిన రోడ్డు కం రైలు వంతెనపై నిర్వహణ సరిగా లేకపోవడంతో రోడ్డుకు ఇరుప్రక్కల మట్టి పేరుకు పోయింది. పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాలతో నిండిపోయింది.. రాజ మహేంద్రవరం వైపు చూస్తే అధ్వానంగా ఉంది. దీంతో ఇటీవల వర్షాలకు వంతెనపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షపునీరు వంతెనపై ఎక్కడికక్కడ నిలిచి పోయి రోడ్డు తరచుగా మరమ్మత్తు లకు గురవుతుంది. మరమ్మతుల నిమిత్తం కోట్లు ఖర్చు పెట్టే అధికారులు నిర్వహణ లో మాత్రం శ్రద్ధ చూపడంలేదు. ఇకనైనా అధికారుల స్పందించి రోడ్డు కం రైలు బ్రిడ్జి నిర్వహ ణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉభయ గోదావరి జిల్లాల ప్రజానీకం కోరుతున్నారు.

ప్రణాళికతో అభివృద్ధికి బాటలు

పల్లె పండుగలో ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రణాళికలు అమలు చేయడం ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పార్టీలకు అతీతంగా సహకారం అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గజ్జరం గ్రామంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ గండి రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నాయకులు, అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఉన్నత పాఠశాల వద్ద ఆడ పిల్లలను ఈవ్ టీజింగ్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అదుపులో పెట్టడానికి ఎస్ఐ రామకృష్ణకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి ఎస్టిమేటు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండమూడి శేషు, ఎంపీడీవో టీవీవీ రమణ, డీఈ శ్రీనివాస్, ఏఈ త్రిమూర్తులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నూర్జహాన్, ఈవోపీఆర్డీ వీరన్న, ఏపీవో రమాదేవి, ఎంపీటీసీ చిన్నబ్బాయి, నాయకులు కాకర్ల వంశీ, లింగాచారి, బాలకృష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

17, 18 తేదీల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

పెరవలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 17, 18 తేదీల్లో మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి దుర్గేష్ శ్రీకారం చుట్టనున్నారని అధికారులు తెలిపారు. 17న అజ్జరం, కాకరపర్రు, 18న పెరవలి, కొత్తపల్లి, ఖండవల్లి, ముక్కామల, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్లవేమవరంలో ఈ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు చంద్రయ్య

పుస్తకావిష్కరణలో మంత్రి దుర్గేష్

దేవరపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర యోధుడు ద్వారబంధాల చంద్రయ్య జీవితచరిత్ర పుస్తకాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు సోమవారం రాజమహేంద్రవరంలో జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, దేశిరెడ్డి బలరామ నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ స్వాతంత్ర సమరయోధుడు చంద్రయ్య అల్లూరి సీతారామరాజు కంటే ముందే 1879లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారన్నారు. చంద్రయ్య స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలని, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని వక్తలు కోరారు. దీనిపై మంత్రి మాట్లా డుతూ చంద్రయ్య స్మృతివనం, విగ్రహాల ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబుల దృష్టికి తీసుకెళ్ళి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనిశెట్టి మధు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌కు చంద్రయ్య జీవితచరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

నిత్యావసరాల ధరలు అదుపు చేయాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాలు, కూరగాయల ధరలను అదుపు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నూనెలు, పప్పులు, కిరాణా, కూరగాయలు తదితర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉల్లిపాయలు, టమోటా, వెల్లుల్లి వంటివి నల్లబజార్లకు చేరడంతో వ్యాపారుల మాయాజాలంతో ధరలు దారుణంగా పెరిగిపోయాయని తెలిపారు. తక్షణమే ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు సగటు మనిషికి చేయగలిగింది ఏమైనా ఉందంటే అది ధరలు నియంత్రించడమే అని ఆయన పేర్కొన్నారు.

పాలంగిలో బంగారం చోరీ..కేసు నమోదు

ఉండ్రాజవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి గ్రామంలో ఓ ఇంట్లో బంగారం చోరీ జరిగినట్టు ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి చెందిన వేండ్ర దుర్గాసాయికిశోర్, అతడి భార్య ఉద్యోగ నిమిత్తం సోమవారం ఉదయం తణుకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి తలుపు తీసి బెడ్‌రూమ్‌లోకి వెళ్లగా బీరువా పగులగొట్టి ఉంది. వాటిలో బంగారు వస్తువులు చూడగా సుమారు 8కాసుల బంగారు వస్తువులు దొంగతనానికి గురైనట్టు గుర్తించారు. ఇంటి వెనుక తలుపు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కాల్దరిలో రోడ్డు మరమ్మతులు



ఉండ్రాజవరం,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్దరి రైల్వే అండర్‌పాస్ ముందు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండడంతోపాటు పాడైపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కాల్దరి, వేలివెన్ను ప్రజలు, మాజీ ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనువాస్(రొయ్యల శ్రీను) సహకారంతో మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. పనులను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ జడ్పీటీసీ కేవీ సుబ్బారావు, పలువురు నాయకులు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు

కొవ్వూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డివిజన్ పరిధిలోని 9 మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, పలు ప్రభుత్వ శాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చాగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కలవలపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు అబ్బూరి సీతారామాంజనేయులు (సీతారాముడు) తల్లి అన్నపూర్ణమ్మ(93) ఇటీవల మృతి చెందారు. సోమవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. అన్నపూర్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయనతో పాటుగా టీడీపీ యువ నాయకుడు నాదెళ్ళ శ్రీరామ్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన పాతకోకిల సురేంద్ర ప్రమాదవశాత్తు మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తదితరులు పరామర్శించారు.

అప్పు తీర్చమంటే వైసీపీ నాయకుడి దాడి!



- నాపై కేసుపెట్టమని మాజీ ఎంపీ భరత్ అనడం న్యాయమా
- యాంకర్ కావ్యశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14: నాపై వైసీపీ నాయకుడు ఎన్‌వీ శ్రీనివాస్ దాడి చేస్తే తిరిగి నాపైనే కేసుపెట్టమని మాజీ ఎంపీ భరత్ రామ్ అనడం ఎంత వరకు న్యాయమని యాంకర్ కావ్యశ్రీ ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం తెలు గు మహిళా నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు ఎన్‌వీ శ్రీనివాస్ తనయుడు అభిలాష్‌కు మూడేళ్ల కిందట అప్పుగా రూ.3 లక్షల నగదు ఇచ్చానని అప్పటి నుంచి 30 సార్లుకు పైగా అడిగానన్నారు. ప్రతిసారి వీడియోరికార్డింగ్ చేశానన్నారు.ఆ సొమ్మును తిరిగి అడిగినందుకు దాడి చేశా రన్నారు. గతంలో ఎంపీ భరత్ రామ్‌కు అప్పువిషయమై చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు నాపై దాడి జరిగితే తిరిగి నాపైనే కేసుపెట్టమని అదే భరత్ చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్‌వీ.శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని రాష్ట్ర హోంమంత్రి అనితను కోరతామన్నారు. తెలుగు మహిళా నేతలు మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియలు మాట్లాడుతూ వైసీపీ నాయకులంతా వారు ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో వుండి అహంతో వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలపై దాడులు కూటమి ప్రభుత్వం సహించదన్నారు.బాధిత మహిళకు తెలుగు మహిళలు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళలు బోను ఈశ్వరి, శ్రీలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిపాయిదిబ్బలో శ్రీకనకదుర్గమ్మ ఊరేగింపు దృశ్యం

పోలవరం కాల్వలో నిమజ్జనం

దేవరపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రులు ముగింపు సందర్భంగా దేవరపల్లిలోని బాలదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపును ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రారంభించారు. గ్రామంలోని పలు వీధుల్లో బ్యాండు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, వివిధ వేషధారణల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోలవరం కాల్వలో అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లక్కీ..ఛాన్స్!

(ఐదో పేజీ తరువాయి)

ఎక్సయిజ్ సిబ్బంది చెప్పినా చాలా మంది కదల్లేదు. లాటరీలో షాపు వచ్చి లాటరీకి రాని వారికి ఎక్సయిజ్ సిబ్బంది ఫోను చేసి సమాచారం అందించారు. రాజమహేంద్రవరానికి సంబంధించి సిండికేటుదారులు సుమారు 350 దరఖాస్తులు సమర్పించగా 16 షాపులు దక్కాయని చెబుతున్నారు. ఓ సిండికేటు 30 దరఖాస్తులు వేయగా ఒక్క షాపు దక్కింది. షాపుల కేటాయింపుల్లో సిండికేట్ల మాయాజాలం విజయం సాధించడంతో వారితో సంబంధం లేని వారికి దక్కిన షాపుల పరిస్థితిపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. సిండి కేటులో లేనివారికి ఒకవేళ కేటాయింపులో గెలిచినా అమ్మకాలు బాగా జరిగే చోట షాపు అద్దెకు తీసుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదనిపిస్తోంది. కచ్చితంగా సిండికేటు పాలసీకి తలొగ్గకపోతే వ్యాపారం చేయడం కష్టమని చెబుతున్నారు.

రండి బాబూ రండి..

మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిని ముందుగానే ప్రసన్నం చేసుకోడానికి ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు వాళ్లు ఆనం కళా కేంద్రం వద్ద ప్రత్యేకంగా కియోస్కులను ఏర్పాటు చేశారు. షాపునకు చెల్లించాల్సిన తొలి విడత ఫీజు నిమిత్తం కొందరు నగదు తీసుకొచ్చారు. వారికి అప్పటికప్పుడు కరెంట్ ఎకౌంటు ఓపెన్ చేసి డీడీ ఇచ్చారు. షాపులు దక్కించుకున్న వారి పేర్లను సేక రించి అకౌంటు ఓపెన్ చేయించే విధంగా ఫోను నెంబర్లు తీసుకున్నారు.

అదృష్టం లేదు: పి.వరలక్ష్మి, కొవ్వూరు

సిండికేటులో చేరలేదు. మేమే సొంతగా వ్యాపారం చేద్దామని తొలిసారిగా రూ.2లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లిం చాం. ఇంట్లో వాళ్లమే తలో కొద్దిగా డబ్బు పోగు చేసు కున్నాం. అదృష్టం వరించలేదని అనుకుంటున్నాం. షాపు దక్కలేదు.

పారదర్శకంగా నిర్వహించాం

లావణ్య, జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి



నూతన మద్యం పాలసీకి సంబంధించి షాపుల కేటాయింపునకు నిర్వహించిన లాటరీని అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. కలెక్టర్ ప్రశాంతి సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ లాటరీకి ఏర్పాట్లు చేశాం. ముందస్తుగా తగు కసరత్తు చేశాం. దీంతో ఎలాంటి విమర్శలకూ తావు లేకుండా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ప్రక్రియను వీడియోలో నిక్షిప్తం చేశాం.

లైసెన్సు పట్టేశారు!

- మద్యం షాపులకు లక్కీడిప్
- లైసెన్సుదారుల ఎంపిక
- కొవ్వూరు సర్కిల్లో 16 మందికి కేటాయింపు

కొవ్వూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 ప్రైవేటు మద్యం దుకాణాలకు 16 మంది లైసెన్సుదారులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసినట్టు సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు సర్కిల్ పరిధిలోని 16 ప్రైవేటు మద్యం దుకాణాలకు లైసెన్సుకు 715 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డిప్ నిర్వహించారు. దీనిలో లైసెన్సు దక్కించుకున్న అభ్యర్థులు సంవత్సరపు లైసెన్సు ఫీజులో 1/6వ వంతు సొమ్ము బ్యాంకులో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి పేరున డీడీ తీసి ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం లోపు స్థానిక ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం డిపో నుంచి తమకు కావలిసిన బ్రాండ్లను ఎంపిక చేసుకుని 16వ తేదీ ఉదయం 10గంటల నుంచి షాపుల్లో విక్రయాలు ప్రారంభించుకోవచ్చునని సీఐ సత్యనారాయణ తెలిపారు.

తీపర్రులో మూడు షాపులు

పెరవలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లిక్కర్ షాపుల లాటరీలో తీపర్రుకు లక్కీ చాన్స్ తగిలింది. గ్రామంలో మొత్తం ముగ్గురికి లాటరీలో వివిధ షాపులు దక్కాయి. పెరవలి మండలంలో రెండు షాపులు కాగా ఒకటి ఉండ్రాజవరం మండలంలో దక్కింది. వైసీపీ, టీడీపీలకు చెందిన పలువురు గ్రూపులుగా ఏర్పడి డీడీలు తీయగా ఒక్కో పార్టీకి ఒక్కో షాపు చొప్పున పొందుకున్నారు. కాగా జనసేనకు చెందిన యువకులు కలిసి మూడు డీడీలు తీయగా వాటిలో ఒకటి ఉండ్రాజవరం మండలంలో దక్కింది.

డ్రాలో షాపులు గెలిచినవారు వీరే..

దేవరపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపు రాజమహేంద్రవరంలో ఆనం కళాకేంద్రంలో సోమవారం కలెక్టర్ సమక్షంలో ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా జరిగింది. దేవరపల్లిలో షాపు నెంబరు.44 సుంకర వీరవెంకట దుర్గారావు, షాపు నెంబరు. 45 పేరిచర్ల సత్యనారాయణరాజు, షాపు నెంబరు.46 ఆరేపల్లి నరేష్, షాపు నెంబరు.47 కొఠారు హేమనాగసత్య సురేంద్రకుమార్, షాపు నెంబరు.48 ఈద్పూగంటి ఇంద్రాని, గోపాలపురంలో.. షాపు నెంబరు.54 ఆలపాటి అరుణ్‌కుమార్, షాపు నెంబరు.55 ఎస్.రవికుమార్, షాపు నెంబరు.56 కొండేపాటి ఫణికుమార్, నల్లజర్లలో.. షాపు నెంబరు. 72 సత్య, షాపు నెంబరు.73 పి.పూర్ణశేఖర్, షాపు నెంబరు. 74 సీహెచ్ మురళీకృష్ణ, షాపు నెంబరు. 75 టీ.శ్రీనివాసరావు, షాపు నెంబరు.76 పుప్పాల అనీల్‌కుమార్, షాపు నెంబరు.77 కూచిపూడి సుబ్రహ్మణ్యం డ్రాలో గెలుపొందినట్టు ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

మహిళ సాధికారతకు కృషి చేయాలి



కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):మహిళ సాధికారత సాధించే దిశగా అన్ని స్వచ్ఛంధ సంస్థలు పని చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. సోమవారం నల్లజర్లలో పార్ట్ ఇండియా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థిక పరిస్థితికి అలంబనగా మహిళ సాధికారిత సాధించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ద్వారా మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడే స్తోమత ఉంటుందన్నారు.ప్రస్తుతం సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి,టీడీపీ జిల్లా కార్యదర్శి కూసిపూడి ఉదయ భాస్కరరావు, ఎండీ ఫరీణ్, కూరపాటి నాగరాజు, జీవీవీ ప్రసాద్, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, గోతం సత్యలక్ష్మి, గుదే శిరీష, ఉన్నమట్ల సత్య పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు

దివాన్‌చెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి జరుగుతాయని జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో రెండు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులకు పాఠశాలలోనే వసతిసౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అండర్-14, 17, 19 విభాగాల్లోని దాదాపు 450 మంది బాలబాలికలు హాజరవుతారని స్వామి తెలిపారు.

కలెక్టర్ హెచ్చరించినా..
ఇసుక అక్రమ రవాణా

నల్లజర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలో ఇసుక రెచ్చిపోతోంది. సుభద్రపాలెంలో రైతులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతో ఏకంగా రెండు లక్షల వ్యయంతో దుద్దుకూరు నుంచి మెటల్ తీసుకుని వచ్చి రోడ్డు గుంటలు పూడ్చుతున్నారు. రోడ్డు గుంతలు లేకుండా చేస్తే కాని ఇసుక రవాణా చేసేం దుకు వీల్లేదని రైతులు రెండు రోజుల నుంచి ఆందోళన చేయడంతో శనివారం ఆంధ్రజ్యోతిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై కలెక్టర్ ప్రశాంతి స్పందించి సంబంధిత అధికారులపై అగ్రహం వ్యక్తం చేయడంతో ఎర్ర కాల్వ నుంచి ఇసుక రవాణా చేయకుండా జేసీబీతో గుంతలు తవ్వించారు. అయినా అప్పటికే నిల్వ చేసిన ఇసుక గుట్టలను లారీలో దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనంతపల్లి, నబీపేట, కవులూరు, పోతినీడుపాలెంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఆకట్టుకున్న అమ్మవారి ఊరేగింపు

చాగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సిపాయిదిబ్బలోని శ్రీకనకదుర్గమ్మ నవరాత్రు లు ముగింపు సందర్భంగా అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. పూలతో అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలవలపల్లిలోను శ్రీకనకదుర్గమ్మ నవరాత్రుల ముగింపు సందర్భంగా అమ్మవారి ఊరేగింపు జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర

నిడదవోలు

వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వేట్టయన్
శ్రీగణపతి	: మార్టిన్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర